


# నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162








ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2030 | సంచిక : 311 | సోమవారం 23 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,



# రైతుల ఇంటికే కొత్త అడంగల్

## భూ యజమానులకు శుభవార్త..

ఆంధ్రప్రదేశ్‌లోని భూ యజమానులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూముల మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే, సవరించిన కొత్త అడంగల్ పత్రాలను నేరుగా యజమానుల నివాసాలకే పోస్టు ద్వారా పంపాలని నిశ్చయించింది. ఈ నిర్ణయంతో భూ యజమానులకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి. ఈ మేరకు భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ (సీసీఎల్ఏ) జి. జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ మధ్య ఈ పత్రాల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రస్తుత నెల నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్-కలెక్టర్లను ఆదేశించారు.




- భూ యజమానుల ఇళ్లకే సవరించిన అడంగల్ పత్రాలు పోస్టల్ శాఖ ద్వారా పంపిణీకి ఏపీ ప్రభుత్వం నిర్ణయం
- ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ మధ్య డెలివరీ 2లో
- అడంగల్ జాప్యంపై 40-50 శాతం అసంతృప్తి నేపథ్యంలో చర్యలు
- ఈ నెల 26 నుంచి 31,000 మందికి కొత్త అడంగళ్ల పంపిణీ





## పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ.. ఎవరైనా పోటీ చేయవచ్చు

- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- పార్టీ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ 2లో
- పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం
- పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని వెల్లడి
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు.

## బెంగళూరు చేరుకున్న షర్మిల..



- యలహంక ప్యాలెస్‌లోకి వైఎస్ షర్మిల ప్రవేశంపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు 2లో
- కోర్టు ఆదేశాలు కచ్చితంగా అమలు చేసేందుకు సిద్ధమైన బెంగళూరు పోలీసులు
- సిలికాన్ బిల్డర్స్ సంస్థ తరఫున కోర్టులో పిటిషన్ దాఖలు

వైఎస్ కుటుంబంలో వివాదం మరింత ముదురుతోంది. బెంగళూరులో జగన్ నివాసం ఉంటున్న యలహంక ప్యాలెస్ లోకి వైఎస్ షర్మిలకు ప్రవేశం లేదంటూ కోర్టు సంచలన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో,

## జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు:

- ఐఐటీలతో సమానంగా ఐటీఐలకు గుర్తింపు దక్కాలన్న లోకేశ్
- ప్రధాని మోదీ పోస్టుకు ఏపీ విద్యాశాఖ మంత్రి మద్దతు
- ఏఐ కాలంలో టెక్నికల్ నైపుణ్యాలకే అధిక విలువ
- జర్మనీ పరిశ్రమల అనుభవాన్ని ప్రస్తావించిన లోకేశ్ 2లో



ఐఐటీ విద్యార్థులతో సమానంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) విద్యార్థులకూ సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ

## పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు

- పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ 2లో
- స్థానిక సంస్థల ఫలితాలు ప్రజాభిప్రాయానికి నిదర్శనమన్న సీఎం చంద్రబాబు
- పంచాయతీల్లో ఏకగ్రీవాల కోసం గ్రామ నేతలతో మాట్లాడాలని ఎమ్మెల్యేలకు సూచన
- ఏకగ్రీవ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- పార్టీ నేతల మధ్య పంతాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు



## నా మాట విన్నారు.. బంగారం ధరలు తగ్గాయి:



- బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న తన పిలుపునకు ప్రజలు స్పందించారన్న ప్రధాని
- ప్రజలు తన మాట వినడంతో పసిడి ధరలు తగ్గి, వారి డబ్బు ఆదా అయిందని వ్యాఖ్య
- లాల్ బహదూర్ శాస్త్రి పిలుపును గుర్తుచేస్తూ దేశ ప్రజల స్వభావాన్ని కొనియాడిన మోదీ
- గణనీయంగా తగ్గిన బంగారం దిగుమతులు, డిమాండ్ అని చెబుతున్న గణాంకాలు 2లో

బంగారం కొనుగోళ్లు తగ్గించాలంటూ తాను చేసిన విజ్ఞప్తికి దేశ ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు తన మాట విని కొనుగోళ్లు తగ్గించడంతో బంగారం ధరలు దిగివచ్చాయని, తద్వారా వారి డబ్బు ఆదా అయిందని ఆయన పేర్కొన్నారు. లఖ్‌నవూలోని గోమతీ నగర్‌లో శనివారం జరిగిన 5వ జాతీయ నైపుణ్య స్నాతకోత్సవంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ "ఏడాది పాటు అవసరమైతే తప్ప బంగారం కొనవద్దని నేను దేశ ప్రజలను కోరాను. గతంలో తీవ్ర ఆహార కొరత ఏర్పడినప్పుడు, ఒక పూట భోజనం మానెయ్యాలని మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పిలుపునిచ్చారు.




# పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ప్రాతిపదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పంచాయతీలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు.

గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# కేసీఆర్.. మళ్లీ సీఎం !

వరంగల్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 2028లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 420 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వరంగల్ గడ్డ ఉద్యమాలకు, ధిక్కార స్వరాలకు ప్రతీక అని, కాకతీయుల పౌరుషం, కాళోజీ స్ఫూర్తి, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో కరోనా వంటి సంక్షోభ సమయంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు, సాగునీటి సమస్యలు లేకుండా పాలన సాగించామని చెప్పారు. రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలిచామని తెలిపారు. రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.2 వేలకు పెంచడంతో పాటు పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చామని వివరించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి రెండూ కుంటుపడ్డాయని విమర్శించారు.

**4.71 లక్షల మందికి కోత** పెన్షన్లు పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు వాస్తవాలు మాట్లాడాలని కేటీఆర్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉన్న రూ.2 వేల పింఛన్‌ను కొనసాగిస్తూనే కొత్తగా పెన్షన్లు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరమని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది లక్షన్నర, రెండో ఏడాది మరో లక్షన్నర, మూడో ఏడాది లక్షా 20 వేల చొప్పున మొత్తం 4.71 లక్షల పెన్షన్లకు కోత పెట్టారని ఆరోపించారు. కొత్తగా 4.63 లక్షల పెన్షన్లు మాత్రమే మంజూరు చేశారని పేర్కొన్నారు. పెంచినట్లు చెబుతున్నారా? తగ్గించినట్లు చెబుతున్నారా? అని ప్రశ్నించారు. వృద్ధులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు.

**మహిళలకు రూ.85,500 బాకీ** ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి 36 నెలలు గడిచినా అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.85,500 బకాయి పడిందని చెప్పారు. ఇతర పెండింగ్ హామీలను కలిపితే ఒక్కో మహిళకు చెల్లించాల్సిన మొత్తం రూ.1.50 లక్షలకు చేరుతుందని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తానంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా వారిని లక్షాధికారులుగా చేసి చూపించాలని సవాల్ విసిరారు. మహిళలకు రూ.1.50 లక్షల చొప్పున చెల్లిస్తే తాను శాశ్వతంగా రాజకీయాలను వదిలిపెట్టి వెళ్తానని ప్రకటించారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం వంటి హామీలను కూడా కాంగ్రెస్ విస్మరించిందని ఆరోపించారు.

**సొంత ఎమ్మెల్యేలే అవినీతిని బయటపెడుతున్నారు**

కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో ఆ పార్టీ నేతల వ్యాఖ్యలే వెల్లడిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ఐదు నుంచి పది లక్షల రూపాయల వరకు వసూళ్లు చేస్తున్నారని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చెబుతుంటే, 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు జరగడం లేదని మరో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొంటున్నారని గుర్తుచేశారు. పారిశ్రామికవేత్తలను బెదిరించి వందల కోట్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు, దేవాలయ భూముల వ్యవహారంపై మాజీ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కాకుండా పర్సంటేజీల పాలన సాగుతోందని విమర్శించారు.

**వరంగల్ అభివృద్ధిని మూడేళ్లుగా అటకెక్కించారు**

కేసీఆర్ పాలనలో వరంగల్‌ను ప్రధాన పారిశ్రామిక, విద్యా, వైద్య, ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పునాదులు వేశామని కేటీఆర్ తెలిపారు. 24 అంతస్తులు, 2,250 పడకలు, 35 వైద్య విభాగాలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు 90 శాతం పూర్తయ్యాయని చెప్పారు. జనగామ, మహబూబాబాద్ ఆసుపత్రుల పనులు కూడా దాదాపు 90 శాతం పూర్తయ్యాయని వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఆరు ప్రభుత్వ వైద్య కళాశాలలు మంజూరు చేసి వైద్య విద్యకు ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు.

మడికొండ ఐటీ పార్కులో ఎల్ అండ్ టీ మైండ్‌ట్రీ, సైయెంట్, టెక్ మహీంద్రా, క్వాడ్రంట్ వంటి సంస్థలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కిటెక్స్, గణేశా ఎకోస్పియర్, యంగ్‌వన్ వంటి పరిశ్రమలకు అవకాశం కల్పించి వేలాది మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు రూ.150 కోట్లతో రెండు సమీకృత కలెక్టరేట్లు, ఔటర్ రింగ్ రోడ్డు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో వరంగల్‌కు ఒక్క కొత్త ఐటీ కంపెనీని, ఒక్క కొత్త పరిశ్రమను తీసుకురాలేకపోయిందని కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికే ఉన్న కంపెనీలు కూడా మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మిగిలిన పనులను పూర్తి చేయలేని ప్రభుత్వం, ప్రైవేటు ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు మాత్రం ప్రాధాన్యం ఇస్తోందని ఎద్దేవా చేశారు. పేదల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించకుండా మెడికవర్ ఆసుపత్రిని ప్రారంభించడంపై ప్రశ్నలు సంధించారు. ఆ ఆసుపత్రితో ముఖ్యమంత్రికి బినామీ సంబంధాలున్నాయన్న ఆరోపణలను కూడా ప్రస్తావించారు.

**ఫ్యూచర్ సిటీ కాదు.. ఫ్యూచర్ ఉన్న సిటీ వరంగల్**

హైదరాబాద్ సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం భూములు సేకరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దాని పేరు మార్చి ఫ్యూచర్ సిటీగా ప్రచారం చేసుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. నిజమైన భవిష్యత్తు ఉన్న నగరం వరంగల్ అని వ్యాఖ్యానించారు. వరంగల్‌ను ప్రధాన పారిశ్రామిక, ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యతను భవిష్యత్తులో తాను తీసుకుంటానని ప్రకటించారు.

**విద్యా వ్యవస్థలో మార్పులపై అభ్యంతరం**

ఇంటర్మీడియట్ విద్యను రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రి కుటుంబాలకు చెందిన ప్రైవేటు విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కాళోజీ కళాక్షేత్రంలో కుడా కార్యాలయ ఏర్పాటుపై విమర్శలు** ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరు మీద 1,217 మంది కూర్చునే సామర్థ్యంతో నిర్మించిన కళాక్షేత్రంలో కుడా కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. కవులు, కళాకారులు, రచయితల కోసం నిర్మించిన కళాక్షేత్రాన్ని ప్రభుత్వ కార్యాలయంగా మార్చాలనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వరంగల్ ప్రజల వ్యతిరేకత నేపథ్యంలో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందని పేర్కొన్నారు. కాకతీయుల కళాతోరణం, కాళోజీ వారసత్వం, వరంగల్ సాంస్కృతిక వైభవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**సాగునీటి నిర్వహణలోనూ వైఫల్యం** గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. దేవాదుల పంపులు, కన్నెపల్లి మోటార్లను సమర్థంగా నిర్వహించి నీటిని వినియోగించుకోవాల్సిన సమయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. చెరువులు, రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వానికి సరైన ప్రణాళిక, చిత్తశుద్ధి లేవని మండిపడ్డారు.

**ఓరుగల్లు గడ్డతో ఉద్యమ అనుబంధం**

వరంగల్‌తో తనకు విడదీయలేని అనుబంధం ఉందని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇదే వరంగల్‌లో కాగదాల ప్రదర్శనలో పాల్గొన్న రోజులు, 17 ఏళ్ల క్రితం నవంబర్ 29న అరెస్టయి వరంగల్ కేంద్ర కారాగారంలో గడిపిన సందర్భాలు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోని ప్రతి కీలక సందర్భంలోనూ వరంగల్ ప్రజలు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఉద్యమ మహాగర్జన నుంచి తెలంగాణ రజతోత్సవ సభ వరకు ఓరుగల్లు ప్రజలు అందించిన మద్దతును మరువలేమన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం 1,200 మంది బిడ్డలు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఢిల్లీ పెద్దల ముందు మోకరిల్లుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే అధిష్ఠానాల మెప్పే వారికి ముఖ్యమైందని ఆరోపించారు. కాకతీయుల పౌరుషానికి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన ఓరుగల్లు గడ్డపై కాంగ్రెస్, బీజేపీల రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

**2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం**

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గుర్తుంచుకోవాలని కేటీఆర్ కోరారు.

వరంగల్ అభివృద్ధి, యువతకు ఉపాధి, ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రతి పరీక్షా సమయంలోనూ ఓరుగల్లు అండగా నిలిచిందని, భవిష్యత్తులోనూ ప్రజల ఆశీర్వాదం తమకు ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు.

వరంగల్ సభ వేదికగా గౌరు తిరుపతిరెడ్డితో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# తీర్పులను విమర్శించండి.. రాజ్యాంగ వ్యవస్థలను కాదు: సీజేఐ సూర్యకాంత్




ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన సంస్థలు తీసుకునే నిర్ణయాలను విమర్శించే హక్కు పౌరులకు ఉంటుందని, అయితే ఆ సంస్థలనే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఒక నిర్ణయంపై అసమ్మతిని తెలపడానికి, సదరు నిర్ణయం వెలువరించిన సంస్థను కించపరచడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో గల సెంట్రల్ యూనివర్సిటీ పదో స్నాతకోత్సవానికి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ సంస్థల నిర్ణయాలను, ఆ సంస్థల ఉనికిని ఒకటిగా చూసే ధోరణి పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య మనుగడకు కీలకమైన వ్యవస్థలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. నిర్ణయాలపై ఆరోగ్యకరమైన చర్చలు, విమర్శలు అవసరమే అయినప్పటికీ, వాటిని సంస్థలపై దాడిగా మార్చవద్దని హితవు పలికారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి సహనం, పట్టుదల ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

పర్వత ప్రాంతాల్లో గమ్యానికి చేరుకునే దారి ఏ విధంగా వంకరటింకరగా ఉంటుందో, జీవిత ప్రయాణం కూడా అలాగే ఉంటుందని వివరించారు. విజయం సాధించడంలో ఇతరుల సహకారం కూడా కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 702 మంది విద్యార్థులకు పట్టాలను, 32 మందికి స్వర్ణ పతకాలను ప్రదానం చేశారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, గవర్నర్ కవిందర్ గుప్తా ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.

# రైతుల ఇంటికే కొత్త అడంగల్

రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15 మధ్య సుమారు 31,000 లావాదేవీ (ట్రాన్సాక్షన్), సవరణ (కరెక్షన్) మ్యుటేషన్ దరఖాస్తులు నమోదయ్యాయి. వీరికి సంబంధించిన సవరించిన అడంగల్ ప్రతులను నవంబర్ 26 నుంచి 30వ తేదీ లోపు పంపిణీ చేయనున్నారు.తహసీల్దార్ ఆమోదం లభించినప్పటికీ, అడంగల్ ప్రతులు అందడంలో జాప్యం జరుగుతోందని 'ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్' (ఐవీఆర్ఎస్) ద్వారా అందిన ఫీడ్‌బ్యాక్‌లో 40 నుంచి 50 శాతం మంది యజమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. పంపిణీలో ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా, మ్యుటేషన్ దరఖాస్తుల్లో శాశ్వత చిరునామాతో పాటు ప్రస్తుత సమాచార మార్పిడి (కరెస్పాండెన్స్) చిరునామాను కూడా తప్పనిసరిగా నమోదు చేయనున్నారు. ఈ నూతన విధానం ద్వారా రెవెన్యూ సేవల్లో వేగం, పారదర్శకత మెరుగుపడతాయని అధికారులు ఆశిస్తున్నారు.

### పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ..

### ఎవరైనా పోటీ చేయవచ్చు:

పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

# నా మాట విన్నారు.. బంగారం ధరలు తగ్గాయి:

అప్పుడు ప్రజలు ఆయన మాట పాటించారు. నా దేశ ప్రజల స్వభావం ఇప్పటికీ అలాగే ఉంది. నాలాంటి సామాన్య వ్యక్తి చేసిన విజ్ఞప్తిని మన్నించి ప్రజలు బంగారం కొనుగోళ్లు తగ్గించారు. 'మోదీ గారూ, మీ మాట విని మా డబ్బు ఆదా చేసుకున్నాం' అని ఇప్పుడు ప్రజలు నాతో చెబుతున్నారు" అని వివరించారు.

**ఫలించిన ప్రధాని పిలుపు** ఈ ఏడాది మే నెలలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు పెరగడంతో, దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఓ సభలో ప్రధాని మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. "జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఏడాది పాటు బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలి" అని ప్రజలను కోరారు. ఇంధన వాడకాన్ని తగ్గించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరించడం వంటి పలు ఇతర విజ్ఞప్తులు కూడా ఆయన చేశారు. ప్రధాని పిలుపు తర్వాత బంగారం డిమాండ్, ధరల్లో గణనీయమైన తగ్గుదల కనిపించింది. గణాంకాల ప్రకారం, మే 9న 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ. 15,250 ఉండగా, ప్రస్తుతం అది రూ. 12,523కు తగ్గింది. ప్రభుత్వ డేటా ప్రకారం, ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో బంగారం దిగుమతులు దాదాపు 40 శాతం తగ్గి 24.78 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే సమయంలో దిగుమతుల విలువ 41.24 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్రపంచ స్వర్ణ మండలి (ఔశీతీశ్రీఎ +శీశ్రీఎ జశీబఅఎఅశ్రీ) నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారం డిమాండ్ 29 శాతం క్షీణించి 162 టన్నులకు పరిమితమైందని తెలిపింది. ప్రజలకు పిలుపునివ్వడంతో పాటు, ప్రభుత్వం కూడా మే నెలలో బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది.

# బెంగళూరు చేరుకున్న షర్మిల..

నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. షర్మిల ఈ సాయంత్రం బెంగళూరు చేరుకున్నారు. అయితే, కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బెంగళూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. షర్మిలతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు ఎవరూ యలహంక ప్యాలెస్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకునేందుకు వారు సిద్ధమయ్యారు. ప్యాలెస్‌లోకి వారు ప్రవేశించకుండా న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో, ఆ ఆదేశాల మేరకు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను కోర్టు డిసెంబర్ 19కి వాయిదా వేసింది.యలహంక ప్యాలెస్ వివాదంపై సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున భీమిశెట్టి రమేష్‌బాబు కోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. వైఎస్ భారతి 2017 ఫిబ్రవరి 16 వరకు ఈ సిలికాన్ బిల్డర్స్ సంస్థలో డైరెక్టర్‌గా వ్యవహరించారని, ప్రస్తుతం రమేశ్ బాబుతో కలిసి ఆమె 'భగవత్ సన్నిధి ఎస్టేట్స్ ఎల్ఎల్పీ'లో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది సుధీర్ మేదమ్మయ్య వాదనలు వినిపించారు. వైఎస్ భారతి తల్లి ఇ.సి. సుగుణమ్మ 2007 మార్చి 1న 20 ఏళ్ల కాలపరిమితితో (2027 ఫిబ్రవరి 28 వరకు) ఈ ప్యాలెస్‌ను తమ సంస్థకు లీజుకు ఇచ్చారని కోర్టుకు తెలిపారు. ఈ ప్రాంగణంలో పండ్లతోటలు, గెస్ట్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాల అభివృద్ధి కోసం సంస్థ భారీగా ఖర్చు చేసిందని వివరించారు. అనంతరం 2026 ఆగస్టు 27న సుగుణమ్మ తన కుమార్తె భారతి, మనుమరాళ్ల పేరిట గిఫ్ట్ డీడ్ రాసిచ్చారని న్యాయవాది పేర్కొన్నారు. గతంలో ప్యాలెస్‌లోని గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఉండేందుకు వైఎస్ షర్మిల అనుమతి తీసుకున్నారని, అయితే ఇప్పుడు అలంకరణ పనుల పేరుతో బయటి వ్యక్తులను అక్కడికి పంపుతున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది ఆరోపించారు. దీనివల్ల ప్యాలెస్‌లోని కట్టడాలకు, విలువైన పండ్ల చెట్లకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం.. షర్మిల, ఆమె కుటుంబ సభ్యులు, అనుచరులు ప్యాలెస్‌లోకి ప్రవేశించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయగా, ఆ ఆదేశాలను అమలు చేసేందుకు పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జర్మనీలో నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు:

మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టుకు లోకేశ్ స్పందిస్తూ, ఈ ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శకంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఫ్యాక్టరీ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత భారీగా పెరుగుతాయని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను యువకుడిగా ఉన్నప్పుడు జర్మనీలోని ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఇంటర్న్‌షిప్ చేశాను. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంతగా గౌరవిస్తారో నేను స్వయంగా చూశాను. ఆ నైపుణ్యాలకు ఇచ్చే గౌరవమే జర్మనీ ప్రపంచంలోనే అత్యుత్తమ తయారీ రంగ కేంద్రంగా ఎదగడానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో కూడా ఐటీఐలపై ఉన్న చిన్నచూపును తొలగించి, నైపుణ్యంతో కూడిన పనులపై గౌరవమర్యాదలు తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని లోకేశ్ వివరించారు. రాబోయే రోజుల్లో తయారీ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. సాధారణ విద్యా కోర్సులతో సమానంగా వృత్తి విద్యా కోర్సులకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం ఏర్పడినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమ వృత్తి పట్ల వారు మరింత గర్వపడే వాతావరణం ఏర్పడుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

# నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసర

# మెప్మా రీజాయిండర్‌లో 'తేదీ' మాయాజాలం!

**- 2026 వివరణకు 2006 తేదీతో సంతకం.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**- సస్పెండ్ చేసి రెండు నెలలైనా బయటపడని 'టేక్ ఓవర్' రుణాల లెక్కలు**

**- నిజాలు నిగ్గుతేల్చాల్సింది పోయి.. ప్రశ్నించిన కలంపై నిందలా?**

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 22 (నంది పత్రిక ) నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. పొదుపు సంఘాల రుణాల్లో జరుగుతున్న అక్రమాలపై ఓ దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమవడంతో, తప్పిదాలను సరిదిద్దుకోవాల్సిన అధికారులు తమ నిర్లక్ష్యాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. పత్రికా కథనాలకు వివరణ ఇస్తూ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విడుదల చేసిన 'రీజాయిండర్' లేఖలో ఏకంగా 19-11-2006 అని తేదీ వేసి సంతకం చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. 2026-27 ఆర్థిక సంవత్సరం గణాంకాలను వివరిస్తూ, ఇరవై ఏళ్ల క్రితం నాటి తేదీతో అధికారిక ప్రకటన విడుదల చేయడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.

**అసలు ప్రశ్నలకు సమాధానమేదీ?** పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ, టేక్ ఓవర్ రుణాల మంజూరులో ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేదని, అంతా పారదర్శకంగా జరుగుతోందని మెప్మా అధికారులు తమ ప్రకటనలో సమర్థించుకున్నారు. కానీ క్షేత్రస్థాయి వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి: సస్పెన్షన్ వెనుక అసలు కథేంటి?: గతంలో ఆఫ్‌లైన్ పద్ధతిలో బ్యాంకుల నుంచి పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో మెప్మా అధికారుల ఆమోదం, సమాచారం తప్పనిసరిగా ఉండాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలను పాత్రికేయులు వెలుగులోకి తీసుకురావడంతో సంబంధిత బ్యాంకు అధికారి ఒకరిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. రెండు నెలలైనా తేలని లెక్కలు: సదరు అధికారిపై వేటు పడి రెండు నెలలు గడుస్తున్నా, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆఫ్‌లైన్, టేక్ ఓవర్ పద్ధతుల్లో ఎంతమందికి రుణాలు ఇచ్చారు? వాటి రికవరీ పరిస్థితి ఏమిటి? అనే వివరాలను బ్యాంకు అధికారులు కానీ, మెప్మా యంత్రాంగం కానీ స్పష్టంగా బయటపెట్టలేకపోతోంది. బాధ్యతల నుంచి తప్పించుకునే యత్నం: "టేక్ ఓవర్ లోన్ల సమయంలో జరిగే పొరపాట్లకు మెప్మాకు సంబంధం లేదు" అని రీజాయిండర్‌లో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. మరోవైపు, కెనరా బ్యాంకు నివేదిక మేరకు సీవోలు, ఆర్పీల అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఒకే లేఖలో పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడం అనుమానాలకు తావిస్తోంది.

**కలంపై నిందలు తగవు!** పత్రికల్లో కథనాలు వస్తేనే తప్ప కనీసం స్పందించని అధికారులు, లోపాలను ఎత్తిచూపిన పాత్రికేయులపై నిందలు వేయడం, ఆంక్షలు విధించే ధోరణిలో వ్యవహరించడం సరికాదని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. సొంత కార్యాలయం నుంచి వెళ్లే లేఖపై కనీసం తేదీని కూడా సరిచూసుకోలేని స్థితిలో ఉన్న అధికారులు, వేల సంఖ్యలో ఉన్న పొదుపు సంఘాల కోట్లాది రూపాయల రుణాలను ఏ మేరకు పర్యవేక్షిస్తున్నారో అర్థం చేసుకోవచ్చని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేవలం కాగితాలపై గణాంకాలు చూపి చేతులు దులుపుకోకుండా, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నంద్యాల మెప్మా కార్యాలయం, సంబంధిత బ్యాంకుల్లో జరిగిన 'టేక్ ఓవర్' రుణాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని పట్టణ ప్రజలు, పొదుపు సంఘాల మహిళలు డిమాండ్ చేస్తున్నారు.




# జిల్లాస్థాయి 4 వ ర్యాంకింగ్ చెస్ పోటీలు ప్రారంభం

**ప్రారంభించిన నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ,**

**వేదిక:దేవ నగర్ రాహుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్**

**12 వివిధ వయసు కేటగిరీలలో వేరు వేరు గా పోటీలు**




నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 22 ( నంది పత్రిక ) నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్.ఆర్.జి. చెస్ అకాడమీ నిర్వహణలో ఆదివారం నంద్యాల దేవ నగర్ లో ఉన్న రాహుల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు,పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య సహకారంతో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి నాలుగవ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి,సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చదువుతోపాటు కళలు,క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. క్రీడలలో క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన విజయాలకు దోహదం చేస్తుందని అన్నారు.రాహుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని పదును పెడుతుందని,ఏకాగ్రత ఇనుమడింప చేస్తుందని అన్నారు. తద్వారా విద్య లో కూడా రాణించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరు వేరుగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ పోటీల లో ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం ఐదు జిల్లా స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్లు నిర్వహించి ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయిలో వారికి ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో విశ్రాంత అధ్యాపకులు వెంకటయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు పుల్లయ్య,జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాహుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సునీత , చీఫ్ ఆర్బిటర్ లు సుజాత,రమ్య, సీనియర్ చదరంగం క్రీడాకారిణి,బహుమతుల స్పాన్సర్ మాధవి,నిర్వాహకులు మాలిక్ భాషా, శ్రీనివాసులు, కోచ్ రాజేంద్ర చెస్ క్రీడాకారులు,క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కార్తీక పౌర్ణమి ప్రత్యేకత పై త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం.



బేతంచెర్ల నవంబర్ 22 ( నందిపత్రిక ). నవంబర్ 24 కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యులఆధ్వర్యంలో లినంద్యాల జిల్లా,బేతంచెర్ల మండలంలోని మర్రికుంట పెండేకల్లు,ముసలాయి చెరువు గ్రామాల్లోలిఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ గ్రంథముల ప్రచారం చేయడం జరిగినది..కార్తీక పౌర్ణమి దీపం విశిష్ఠత & అంతరార్థం.కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల్లో ధ్వజ స్థంభం పైన దీపం వెలిగిస్తారు ఇలా వెలిగించడం వలన దేవాలయంలో ధ్వజస్తంభం నుండి దేవుని రాజ్యం ప్రారంభమయి గర్భగుడి లోని భగవంతుని వరకు దైవ రాజ్యమే ఉంటుంది అన్న విషయాన్ని తెలియజేస్తుంది అని వివరించారు... కావున గుడి లోకి ప్రవేశించిన వారు ధ్వజ స్థంభ దీపం వద్దకు వచ్చాక ప్రాపంచిక విషయ ధ్యాస లని విడిచి దైవ ధ్యాస లొనే గర్భ గుడి వరకు ఉండాలి అని అర్థం. అదేవిధంగా శరీరమనే దేవాలయం లో బయటి విషయాలు వీడి అంతర్ముఖులమై శరీరం లోపలికి చూస్తే ఆత్మ దర్శనం జరుగుతుంది అని , "దేవాలయ రహస్యములు" గ్రంథం లో గురువు గారు వ్రాసి ఉంచారు అని తెలిపారు.కార్తీక మాసం డిసెంబర్ 8 వ తేదీ వరకు ఉంటుందని అందరూ దీపారాధన చేయాలని, యోగ సాధన చేయడానికి గుర్తు గా దీపం వెలిగించాలని తెలిపారు ఈ కార్యక్రమం లో లిత్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక-చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పి.పుల్లారెడ్డి, చిన్నపుల్లారెడ్డి, నాగమద్దిలేటి, నాగలక్ష్మమ్మ కృష్ణవేణి, వెంకటేశ్వరమ్మ, సురేఖ, సంజీవ , పార్థసారథి లు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన కాటసాని రామభూపాల్ రెడ్డి



కర్నూల్ సిటీ నంది పత్రిక ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ కార్యకర్త పెద్దింటి వెంకటరమణ అనారోగ్యంతో నవంబర్ 11వ తేదీన మృతి చెందారు.ఆ సమయంలో అందుబాటులో లేని వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆదివారం వెంకటరమణ నివాసానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని కాటసాని రామభూపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుస్సేనాపురం గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.**



కర్నూల్ సిటీ నంది పత్రిక గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో దశ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఆదివారం బొమ్మిరెడ్డిపల్లి, వెల్దుర్తి, చెరుకులపాడు, కృష్ణగిరిలలోని నామినేషన్ కేంద్రాలను ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో అనవసర వ్యక్తుల సంచారాన్ని నియంత్రించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఎస్పీ తో పాటు పత్తికొండ డిఎస్పీ వంశీధర్ గౌడ్, సీఐలు రామయ్య నాయుడు, యుగంధర్, మహమ్మద్ గౌస్, చిరంజీవి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, ఎస్ఐలు ఉన్నారు.

# జనసేన నాయకుడికి అండగా నిలిచిన సంధ్య విక్రమ్ కుమార్

**సర్పంచ్ నామినేషన్ వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న సమాచారంతో**

**హుటాహుటిన చేరిక ధైర్యంగా నామినేషన్ వేయాలని భరోసా**



కర్నూల్ సిటీ నందిపత్రిక కోడుమూరు నియోజకవర్గం, కర్నూలు మండలం వెంకాయపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి జనసేన పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేయడానికి సిద్ధమైన జనసేన పార్టీ నాయకుడు దేవమాడ జాన్‌ను కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న జనసేన పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త సంధ్య విక్రమ్ కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా దేవమాడ జాన్‌తో పాటు అక్కడ ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ధైర్యంగా ముందుకు వచ్చి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు.ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి ఒక్కరికీ ఉన్న ప్రజాస్వామ్య హక్కు అని, నామినేషన్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని అధికారులను కోరారు ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపుతూ అభ్యర్థికి అండగా నిలిచారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా పార్టీ తరఫున సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

# పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లాలి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ**



కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లా ఆదోని, కోసిగి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వైవాహిక జీవితం అన్యోన్యత, ప్రేమానురాగాలు, సుఖసంతోషాలతో నిండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం వివాహ వేడుకలకు హాజరైన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రజల సుఖదుఃఖాల్లో భాగస్వాములవుతూ ప్రతి కుటుంబంతో ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా కృష్ణమ్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి, కోసిగి జెడ్పీటీసీ జ్ఞానేష్, ఎంపీపీ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ముత్తారెడ్డి, కోసిగి మార్కెట్ యార్డు చైర్మన్ వీరారెడ్డి వెంకటేష్, గుడిసె శ్రీరాములు, కళిందర్, నా కోసిగయ్య, ఉల్లిగడ్డల వెంకటేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# పరకాలలో పల్స్ పోలియో విజయవంతం

పరకాల నియోజకవర్గం తోపాటు రెవెన్యూ డివిజన్ పరిధిలో గల గ్రామాలు పట్టణాల్లో ఐదు సంవత్సరాల చిన్నారులకు పల్స్ పోలియో కార్యక్రమం ఆయా గ్రామాల సర్పంచులు ప్రజాప్రతిని ప్రారంభించారు. పల్స్ పోలియో వ్యాక్సిన్ వేయించినట్లయితే రాబోవు రోజుల్లో పోలియో ఇతర వ్యాధులు సోకకుండా ఉంటాయని ప్రతి ఒక్కరు ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలను పోలియో కేంద్రాలకు తీసుకొని వచ్చి పోలియో చుక్కలు వేయించుకోవాలని ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా కోరారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది ఆశా వర్కర్లు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# బేతంచెర్లలో వైస్సార్సీపీ విజయోత్సవ ర్యాలీ.



బేతంచెర్ల నవంబర్ 22 ( నంది పత్రిక ). బేతంచెర్ల నగర పంచాయితీ ఎన్నికలకు సంభందించి ఈ నెల 3వ తేదీన జరిగిన ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరఫున చైర్మన్ అభ్యర్థి దూదేకుల దస్తగిరితో పాటు 18 వార్డుల్లో విజయం సాధించిన కౌన్సిలర్లతో 23-11-2026 సోమవారం ఉదయం 08:00 గంటలకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైస్సార్సీపీ కార్యాలయం నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి కార్యాలయం వారు కోరుచు ఆదివారం తెలియ జేశారు.

# బాల అకాడమీ ప్రతిష్టకు రాష్ట్రస్థాయి కిరీటం.

**ఏ పి పి ఎస్ ఏ ఉపాధ్యక్షుడిగా రవీంద్రనాథ్ .**

**విద్యారంగంలో మరో గౌరవప్రదమైన గుర్తింపు.**

**ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాల అకాడమీ డైరెక్టర్ రవీంద్రనాథ్**

**ఎన్నిక పాఠశాలకు గర్వకారణం!**



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 22 ( నంది పత్రిక ) బాల అకాడమీ పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది.విద్యారంగ అభివృద్ధికి, ప్రైవేట్ పాఠశాలల పురోభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ఆయన అందిస్తున్న విశేష సేవలు, నాయకత్వ లక్షణాలు, అంకితభావానికి ఈ పదవి ఒక గొప్ప గుర్తింపుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఒక విద్యాసంస్థ డైరెక్టర్‌గా మాత్రమే కాకుండా, రాష్ట్రస్థాయిలో విద్యారంగానికి సేవలందించే ఉన్నత బాధ్యతను స్వీకరించడం ఎంతో అభినందనీయమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఆయన నాయకత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి, విద్యా ప్రమాణాల పెంపునకు మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశాయి.ఈ సందర్భంగా బాల అకాడమీ కరస్పాండెంట్ మాధవిలత , ప్రిన్సిపాల్ నరేష్ కుమార్ , కోఆర్డినేటర్ ముజీజ్ బాషా , ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది రవీంద్రనాథ్ కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి విద్యారంగానికి విశేష సేవలందించాలని ఆకాంక్షించారు. బాల అకాడమీకి ఇది కేవలం ఒక పదవి కాదు.. విద్యారంగంలో సంస్థ గౌరవాన్ని, ప్రతిష్ఠను మరింత పెంచిన ఒక మైలురాయి!



# భార్య తరపున వడ్డు వెంకటరెడ్డి ప్రచారం బరిలోకి...





**బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 22:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామపంచాయతీ సర్పంచి పదవి జనరల్ మహిళకు కేటాయించారు. ఈ పదవికి ఒడ్డు మహేశ్వరమ్మ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు. రాజకీయంగా ఏళ్ల తరబడి నుండి గ్రామంలోనిస్వార్థంగా సేవలం దిస్తున్న వడ్డు కుటుంబం నుండి మహేశ్వరమ్మకు మద్దతుగా ఆమె భర్త వడ్డు వెంకటరెడ్డి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల మద్దతు కూడబెట్టుకుంటున్నారు. గ్రామ అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా నిస్వార్థ రాజకీయ సేవలు అందిస్తున్న ప్రముఖ నాయకులు, తాజా మాజీ ఎంపీపీ బంధువు వడ్డు వెంకట్ రెడ్డి కుటుంబం ఈసారి తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల బరిలో నిలిచారు. గతంలో 50 ఏళ్ల పాటు రాజకీయ సేవలందించిన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, వెంకట్ రెడ్డి 30 ఏళ్ల పాటు నీటి సంఘం అధ్యక్షుడిగా, 15 ఏళ్ల పాటు పాల కేంద్రం అధ్యక్షుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. తనకు గ్రామంలో సొంత భూమి లేకపోయినప్పటికీ, కేవలం తోటి రైతుల శ్రేయస్సు కోసమే దశాబ్దాల పాటు ఏ ఒక్క పంట ఎండిపోకుండా సాగునీటిని అందించి రైతుల పాలిట ఆపద్బాంధవుడిగా నిలిచారు. 70 ఏళ్ల వయసులోనూ ఎలాంటి మచ్చ లేకుండా, గ్రామంలోని ప్రతి సమస్యను నిక్కచ్చిగా పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న వడ్డు కుటుంబానికి రైతులందరూ ఏకతాటిపై నిలిచి సంపూర్ణ మద్దతు తెలుపుతుండటంతో ఉండడం తో , రానున్న రోజుల్లో గ్రామానికి మరింత మేలు జరిగేలా కృషి చేస్తానని వడ్డు వెంకట్ రెడ్డి కుటుంబం ధీమా వ్యక్తం చేస్తూ ఉంది.

## అధికారం కోసం కాదు గ్రామ అభివృద్ధి కోసం సేవ చేయడానికి నిలబడ్డ

### ఉంగరం గుర్తుకే మీ ఓటు



**సిరివెళ్ల, నవంబర్22( నంది పత్రిక )** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామ పంచాయతీ జనసేన సర్పంచ్ అభ్యర్థిగా రామిరెడ్డి గారి నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేను అధికారం కోసం కాదు కోటపాడు గ్రామ అభివృద్ధి కోసం పోటీలో నిలబడ్డానని ఆయన అన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఒకసారి ఆలోచన చేసి మా వార్డ్ మెంబర్లను నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని నేను ఆశిస్తున్నాను. నా సర్పంచ్ గుర్తు ఉంగరం అని ఆయన అన్నారు. కావున ప్రతి ఒక్కరు ఉంగరం గుర్తుకి ఓటు వేసి వేయించి గెలిపించాలని ఆదే కోటపాడు గ్రామ ప్రజలను కోరారు. కోటపాడు ప్రజలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి అదేమంటే రాష్ట్ర మొత్తం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కావున రాష్ట్ర మొత్తం మీద బాగా అభివృద్ధి చెందుతుంది. కాబట్టి మీరు కూడా అభివృద్ధి చూసి మాకు ఓటు వేస్తే మన గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. అలాగే కోటపాడు గ్రామంలో ఉంగరం గుర్తు పట్టుకొని జనసేన నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్లూరు వారి వివాహానికి హాజరైన మాజీఎంపీపీ బుగ్గన.



**బేతంచెర్ల నవంబర్ 22 ( నందిపత్రిక ).** బేతంచెర్ల నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరి నాగ వెంకటేశ్వర్లు & పార్వతి దంపతుల కుమారుడు అనిల్ కుమార్ & వరలక్ష్మిల వివాహము ఆదివారం బేతంచెర్ల పట్టణంలోని తిరుమల తిరుపతి కళ్యాణ మండపం నందు జరిగింది.ఈ వివాహమునకు బేతంచెర్ల మాజీ ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి,మండల సీనియర్ వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి సీతా రామ చంద్రుడు, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ ఇబ్రాహీం, మరియు బుగ్గానపల్లె గ్రామ వైసిపి నాయకులు తదితరులు హాజరై నూతన వధు వరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రంగస్వామి.

**బేతంచెర్ల నవంబర్ 22 (నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం గూటుపల్లె గ్రామానికి చెందిన పెద్ద రంగప్ప గారి రంగస్వామి వైఎస్ఆర్సిపి తరపున ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ గూటుపల్లె గ్రామ ప్రజలు అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే,గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని రంగస్వామి హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తానని ప్రజలను కోరారు. ఓటు వేసి గెలిపిస్తే అంకిత భావంతో పనిచేసే ప్రజల రుణం తీర్చుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, భీమన్న గారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు రాజంపేటలో మూనిసిపల్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

### చైర్ పర్సన్ &వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటు వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు ప్రీసైడింగ్ అధికారిగా సబ్ కలెక్టర్ భావన



**రాజంపేట( నంది పత్రిక ప్రతినిధి) నవంబర్ 22:** రాజంపేట పురపాలక సంఘంలో నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంతో పాటు వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికను నేడు సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషన్, విజయవాడ జారీ చేసిన నోటిఫికేషన్ నెం. 1474/రాజుజ-ఖీ1/2026-4, తేదీ 04.11.2026 ప్రకారం ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ఈ మేరకు రాజంపేట పురపాలక సంఘం మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు చైర్‌పర్సన్, వార్డు మెంబర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడంతో పాటు వైస్‌చైర్‌పర్సన్ ఎన్నిక చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



## ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధం

### నేడు కొలువు దీరనున్న నూతన పాలకవర్గం మేయర్, కార్పొరేటర్ల పదవీ స్వీకార ప్రమాణం, డిప్యూటీ మేయర్ ఎన్నిక కౌన్సిల్ హాల్లోకి సభ్యులు మినహా ఇతరులకు అనుమతి ఉండదు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థకు ఇటీవల ఎన్నికైన పాలకవర్గ సభ్యుల పదవీ స్వీకార ప్రమాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నూతన మేయర్, కార్పొరేటర్ల పదవీ స్వీకార ప్రమాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, తొలుత మేయర్, అనంతరం కార్పొరేటర్లతో పదవీ స్వీకార ప్రమాణం చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, ఆమె ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులచే పదవీ స్వీకార ప్రమాణం చేయిస్తారని పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మేయర్, 68 మంది వార్డు సభ్యులతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులకు మాత్రమే సమావేశంలోకి అనుమతి ఉంటుందని, ఇతరులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు సమావేశ మందిరం వెనుక భాగంలో ఉండి కార్యక్రమాన్ని కవర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, ఏఈ వైష్ణవి, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లె కళావతమ్మ ను భారీ మెజారిటీతో గెలిపించండి

### అధికారం కోసం కాదు.. గ్రామ అభివృద్ధి కోసం పోటీలో నిలబడ్డారు మీ అమూల్యమైన ఓటును కత్తెర గుర్తుకు వేయండి సాంబావరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన జూపల్లి రాకేష్ రెడ్డి



**గోస్పాడు, నవంబర్22(నంది పత్రిక):-** సాంబవరం గ్రామ ఓటర్లు తమ అమూల్యమైన ఓటును కత్తెర గుర్తుపై వేసి జూపల్లి కళావతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని మధు చిన్నపిల్లల ఆస్పత్రి ఎండి జూపల్లి రాకేష్ రెడ్డి కోరారు. ఆదివారం నంద్యాల నియోజకవర్గం లోని గోస్పాడు మండలం సాంబవరం గ్రామం లో జూపల్లి రాకేష్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా బలపరిచిన కళావతమ్మ అధికారం కోసం కాదు సాంబావరం గ్రామ అభివృద్ధి కోసం పోటీలో నిలబడ్డారని అన్నారు. గ్రామ ప్రజలు ఒకసారి ఆలోచన చేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నాను అని అన్నారు. ఆమె సర్పంచ్ గుర్తు కత్తెర అని అయన తెలిపారు. కావున ప్రతి ఒక్కరు కత్తెర గుర్తుకి ఓటు వేసి వేయించి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. గ్రామ ప్రజలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి అదేమంటే రాష్ట్ర మొత్తం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కావున రాష్ట్ర మొత్తం మీద బాగా అభివృద్ధి చెందుతుంది కాబట్టి మీరు కూడా అభివృద్ధి చూసి కళావతమ్మ కు ఓటు వేస్తే మన గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ ప్రచార కార్యక్రమం లో గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారవేత్త మయూరి వెంకటేశ్వర్లు మృతి



**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 21 . (నంది పత్రిక ):** పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మయూరి వైన్స్, పెట్రోల్ బంకుల అధినేత, వీసీ కాలనీలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ మయూరి వెంకటేశ్వర్లు ఆదివారం కన్నుమూశారు, గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు, ఎల్ఐసీ రంగంలో ఎన్నో ఏళ్ల అనుభవం కలిగి చైర్మన్ క్లబ్ సభ్యుడిగా ఎంతోమంది సామాన్యులకు సేవలందించిన ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కళారత్న చింతలపల్లె కోటేష్ చేతి వేలితో కార్తీక శోభ చిత్రం.





**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 21 . (నంది పత్రిక ):**నంద్యాల కు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ కార్తీక మాసం పురస్కరించుకొని కార్తీక సోమవారం సందర్భంగా వినూత్నంగా ఏ 3 డ్రాయింగ్ చార్టు మీద ఎటువంటి పెన్సిల్, బ్రష్ ఉపయోగించకుండా కేవలం చూపుడు వేలితో వాటర్ కలర్ పెయింటింగ్స్ ద్వారా డైరెక్ట్ గా కార్తీక శోభ చిత్రాన్ని వేశారు. ఈ చిత్రం వేయడానికి 3 గంటల సమయం పట్టిందన్నారు.ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్ర మాసం. శివయ్య కు ప్రీతికరమైన మాసం. ఈ మాసం లో వచ్చే సోమవారాలకు శివునికి ఎంతో ఇష్టం. ఈ చిత్రంలో పరమ శివుడు భక్తులకు దర్శనమిచ్చి చిరునవ్వు తో దీవిస్తున్నట్లు,స్త్రీ లు కార్తీక దీపాలు నదిలో వదలి భక్తితో శివున్ని కొలుస్తున్నట్లు, భక్తులు పుణ్యనది లో స్నానాలు చేస్తూనట్లు,కార్తీక దీపాలతో కార్తీక శోభను చిత్రంలో చూపించాను. శివుని మీద భక్తి తో ఈ చిత్రం వేసాను. ప్రతి కార్తీక మాసం వినూత్న సైలి లో వేస్తువుంటాను. ఈ సారి నా చేతి చూపుడు వేలును కుంచె గా మలచుకొని వేసాను. దీన్ని ఫింగర్ పెయింటింగ్ అని అంటారు. భక్తులందరికి ఆ శివయ్య అనుగ్రహం ఉండాలని కోరుకుంటున్నాను. భక్తులందరికి కార్తీక మాసం శుభాకాంక్షలు.

## అధికారం కోసం కాదు గ్రామ అభివృద్ధి కోసం సేవ చేయడానికి నిలబడ్డ

### మంచం గుర్తుకే మీ ఓటు



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని నియోజకవర్గం లోని నెట్టేకల్ గ్రామ టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా జయలక్ష్మి మాట్లాడుతూ నేను అధికారం కోసం కాదు నెట్టేకల్ గ్రామ అభివృద్ధి కోసం పోటీలో నిలబడ్డానని ఆమె అన్నారు ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఒకసారి ఆలోచన చేసి మా వార్డ్ మెంబర్లను నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని నేను ఆశిస్తున్నాను నా సర్పంచ్ గుర్తు మంచం అని ఆమె అన్నారు కావున ప్రతి ఒక్కరు మంచం గుర్తుకి ఓటు వేసి వేయించి గెలిపించాలని ఆదే నెట్టకల్ గ్రామ ప్రజలను కోరారు నెట్టేకల్ ప్రజలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి అదేమంటే రాష్ట్ర మొత్తం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కావున రాష్ట్ర మొత్తం మీద బాగా అభివృద్ధి చెందుతుంది కాబట్టి మీరు కూడా అభివృద్ధి చూసి మాకు ఓటు వేస్తే మన గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు అలాగే నే ట్టెకల్ గ్రామంలో మంచం గుర్తు పట్టుకొని కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు

## సాంబవరం గ్రామంలో గడ్డివాము దగ్ధం రైతును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి..



**నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 22 ( నంది పత్రిక )** నియోజకవర్గంలో విధ్వంస సంస్కృతి.. గ్రామాలలో భయాందోళనలు సృష్టిస్తున్న తెలుగుదేశం నాయకులు విధ్వంస సాంస్కృతి ని ఆపకపోతే వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది సంస్కృతిని మొదలు పెట్టాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిషోర్ రెడ్డి. శ్రీశైలం నియోజకవర్గం అబ్జర్వర్ పిపీ మధుసూదన్ రెడ్డి తెలియజేశారు..నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం నాయకులు కొత్త విధ్వంస సంస్కృతికి తెరలేపారు, అధికారం కోసం ఆస్తులను ధ్వంసం చేస్తూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో చిచ్చు పెడుతూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షలతో ఇళ్లపైనా, పశువుల దాణాపైనా దాడులు చేయడం ఏమాత్రం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు, పిరికిపంద, కవ్వింపు చర్యలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేతనైతే ప్రజలకు మంచి చేసి, ప్రజాభిమానంతో ఎన్నికలలో గెలవాలి కానీ.. ఇలా అరాచకాలు, విధ్వంసం , దాడులతో భయపెట్టాలని చూడటం దుర్మార్గమైన పద్ధతి అని ప్రజలు మండిపడుతున్నారు. గోస్పాడు మండలం సాంబవరం గ్రామంలో 5వ వార్డు వైసీపీ మద్దతుదారుడు గోపవరం విజయభాస్కర్ కి చెందిన గడ్డివామును కొందరు తెలుగుదేశం నాయకులు నిప్పు అంటించడంతో పూర్తిగా బూడిదైపోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పశువుల దాణా కళ్లెదుటే కాలి బూడిదవ్వడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. ఇది కేవలం ఒక గడ్డివాము కాదని, తమ జీవనోపాధిపై జరిగిన దాడి అని బాధితులు వాపోతున్నారు. ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతూ, ప్రజల ఆస్తులకు నష్టం కలిగిస్తున్న ఇలాంటి దాడులను తక్షణమే అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# నీతి నిజాయితీకి మారుపేరు ఎ చక్రపాణి యాదవ్

**శాసనమండలి మాజీ చైర్మన్ స్వర్గీయ ఎ చక్రపాణి యాదవ్ సంతాప సభ**

**చక్రపాణి యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన మంత్రివర్యులు టీజీ భరత్ మరియు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఏఐసిసి సభ్యులు మరియు కర్నూలు జిల్లా ఇన్చార్జి లక్ష్మీ నరసింహ యాదవ్ మరియు కుటుంబ సభ్యులు**



**కర్నూలు సిటీ నందిపత్రిక** శాసనమండలి మాజీ చైర్మన్ స్వర్గీయ అప్పన బోయిన చక్రపాణి యాదవ్ సంతాప సభ కర్నూల్ నగరం నందలి మౌర్య ఇన్ విభూ పరిణయ ఫంక్షన్ హాల్ నందు సంతాప సభ జరిగినది. కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ సంతాప సభకు ముఖ్య అతిథులుగా హాజరైన పరిశ్రమల శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ మరియు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో చక్రపాణి యాదవ్ లాంటి వారు అరుదుగా ఉంటారని సామాజిక అభివృద్ధి, శాసనమండలి ఏర్పాటులో తనదైన శైలిలో సభ నిర్వహిస్తూ క్రమశిక్షణకు నైతిక విలువలకు కట్టుబడి పని చేశారని తన 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారని కొనియాడారు. వీరి ఆశయాలు స్ఫూర్తి దాయకమని కొనియాడారు. మూడు తరాల వారికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రమశిక్షణ రాజ్యాంగ విలువల పట్ల అపారమైన నమ్మకం అని వారు తెలిపారు. వారి జీవితం భావితరాల వారికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కర్నూలు నగరంలో మన జిల్లా వాసి అయిన మాజీ శాసన మండలి చైర్మన్ చక్రపాణి యాదవ్ విగ్రహా ఏర్పాటుకు కుటుంబ సభ్యులు, బీసీ సంఘాలు మరియు యాదవ సంఘం నాయకుల కోరిక మేరకు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ సభను ఉద్దేశించి హామీ ఇవ్వడం జరిగింది.అనంతరం చక్రపాణి యాదవ్ మనవరాలు (చక్రపాణి యాదవ్ కుమార్తె డాక్టర్ నీరజ కూతురు యునైటెడ్ స్టేట్స్) నిఖిత సాయి మాట్లాడుతూ తాతయ్య చక్రపాణి యాదవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని, ఆయనను ఆదర్శంగా తీసుకుంటామని తెలియజేశారు. ఏఐసిసి సభ్యులు కర్నూలు జిల్లా ఇన్చార్జి, కాంగ్రెస్ పార్టీ పాణ్యం నియోజకవర్గ కోఆర్డినేటర్ జె లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ నిజంగా టీజీ వెంకటేష్ మరియు టీజీ భరత్ ఈ జిల్లాలో బాధ్యతగా పార్టీలకు అతీతంగా చక్రపాణి యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి సంతాప సభ ఏర్పాటు చేయడం టీజీ కుటుంబానికి చక్రపాణి యాదవ్ కు ఎంత అనుబంధం ఉందో అనేది టీజీ వెంకటేష్ టీజీ భరత్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒక సాధారణమైన కుటుంబంలో నుంచి వచ్చి అంచలంచలుగా ఎదుగుతూ ఎంతో మంది ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ఎంతోమంది ముఖ్యమంత్రులతో కేంద్ర మంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఒక న్యాయవాదిగా కాంగ్రెస్ పార్టీలో కడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఆయన సేవలు అందించి అన్ని పార్టీల మద్దతు కూడా గట్టి రాష్ట్రము విడిపోయిన తర్వాత కూడా శాసనమండలి చైర్మన్ గా కొనసాగించడం నిజంగా తన వ్యక్తిత్వానికి మరియు నీతి నిజాయితీకి మారుపేరు అని లక్ష్మీ నరసింహ యాదవ్ కొనియాడారు. కర్నూల్ నగరంలో చక్రపాణి యాదవ్ విగ్రహ ఏర్పాటుకు హామీ ఇచ్చిన మంత్రి టీజీ భరత్ కి లక్ష్మీనరసింహ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలో స్వగ్రామం హుసేనాపురంలో సంతాప సభ ఏర్పాటు చేసి తన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీ తరపున మరియు పెద్దల సహకారంతో ఏర్పాటు చేస్తామని లక్ష్మీ నరసింహ యాదవ్ హామీ ఇచ్చారు. అనంతరం సంతాప సభకు హాజరైన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలియ జేయుచున్నామని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, యాదవ సంఘం పెద్దలు బి తిమ్మయ్య యాదవ్, బాల మద్దయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, పోతుల నాగరాజు యాదవ్, వెంకటరమణ యాదవ్, దేవ శంకరయ్య యాదవ్, శేషపని యాదవ్, సింధు నాగేశ్వరరావు యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య , కే బాబురావు, లక్ష్మీ నరసింహ యాదవ్, సి మోహన్ రావు యాదవ్, బి బాలకృష్ణ యాదవ్, సాంబశివుడు, సుంకన్న, అనంత రత్నం,చక్రపాణి యాదవ్ కుటుంబ సభ్యులు కుమారుడు శశికాంత్ యాదవ్ కుమార్తెలు డాక్టర్ కళ్యాణి, డాక్టర్ నీరజ, అల్లుళ్ళు రమేష్, జయదేవ్, మనవళ్లు మహీధర్, ఉజ్వల్ సాయి, జాహ్నవి, ధీరజ్ మొదలగువారు పాల్గొన్నారు.

## టీడీపీ కుటుంబాలు వైఎస్సార్సీపీ గూటికి



**కొత్తపల్లి – నంది పత్రిక :** సర్పంచు ఎన్నికలు సమీపిస్తున్న వేల టీడీపీ పార్టీ నుంచి వైఎస్సార్సీపీ పార్టీలోకి చేరికలు ఎక్కువయ్యాయి. ఆదివారం మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్సీ గూటికి చేరాయి. మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ ఇంచార్జ్ హరికృష్ణ, వెంకటేశ్వర్లు, రాజు, పవన్, ప్రసాద్, శివకృష్ణ, నాగేంద్ర, చిన్న వెంకటేశ్వర్లు,లింగస్వామి, శ్రీరాములు, తిరుమల్య తో పాటు 10 కుటుంబాలు నందికొట్కూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచు ఎన్నికల్లో అందరు కలసికట్టుగా వైఎస్సార్సీపీ పార్టీ బలపరిచే అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వారి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి వెంకటస్వామి, నాగార్జున రెడ్డి, కృష్ణుడు, కోటిరెడ్డి, స్వాములు,మియ్యసావు, రామసుబ్బయ్య,సాంబ శివుడు, వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపల్లి పంచాయితీ కూటమి సర్పంచ్ అభ్యర్థి తిమ్మసముద్రం పల్లవిని గెలిపించాలి

### టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్



**నందలూరు (నంది పత్రికా ప్రతినిధి) నవంబర్ 23:** కూటమి బలపరిచిన నాగిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థి తిమ్మసముద్రం పల్లవికి మద్దతుగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్పంచ్ అభ్యర్థి తిమ్మసముద్రం పల్లవికి "మంచం" గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, అలాగే 3వ వార్డు సభ్యుడు ఆకుల చలపతికి "కుక్కర్" గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులు నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలిపి, భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జీనేపల్లె పిలుస్తోంది. అభివృద్ధి చేయమంటోంది.

### నందింపల్లె సుంకన్న కత్తెర గుర్తు తో ప్రచార హోరు.

**శిరివెళ్ల: (నంది పత్రిక )** సిరివెళ్ల మండల పరిధిలోని జీనేపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నందిపల్లె సుంకన్న ఆదివారం కత్తెర గుర్తుతో ప్రచార హోరు నిర్వహించారు. పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామాభివృద్ధి కోసం కత్తెర గుర్తుకు ఓటు వేసి నందింపల్లె సుంకన్నను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.గ్రామ అభివృద్ధి కోసం గ్రామం కోసం గ్రామ ప్రజల సంక్షేమం కోసం కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి తనకు కేటాయించిన కత్తెర గుర్తుపై ఓటు వేసి, వేయించి గెలిపించాలని ఆయన కోరారు. గ్రామ అభివృద్ధికే నా ప్రాధాన్యత అని, గ్రామంలో సమస్య లేకుండా పరిష్కరిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి భోగాపతి శిరీష బుట్ట గుర్తు ని అత్యధిక మెజార్టీతో గెలిపించండి



**నందలూరు (నంది పత్రిక ప్రతినిధి) నవంబర్ 22:** నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన భోగాపతి శిరీష బుట్ట గుర్తుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. నాగిరెడ్డిపల్లిగ్రామపంచాయతీ ఒకటి రెండో వార్డుల నందు స్థానిక నాయకులు గొబ్బిళ్ళ త్రినాథ్ గుణ యాదవ్ వేణు గోపాల్ బడే జానీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు గ్రామ నాయకులు నాగిరెడ్డిపల్లె నందలూరు గ్రామ పంచాయతీలకు చెందినవైసిఎ పార్టీనాయకులు భోగాపతి శిరీష యొక్క బుట్ట గుర్తుపైన మీ యొక్క అమూల్యమైన ఓటును వేసి,వేయించిగెలిపించవలసినదిగా వైసిపి నాయకులు కోరారు. ఈకార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఅన్నమయ్య జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు నడిపీధి సుధాకర్, యువజన నాయకులు మాజీ ఏజీపీ సెమీ ఉల్లా ఖాన్, మెడ శ్రావణ్, నాగార్జున రెడ్డి, మాజీ ఎంపిటిసి సోమిశెట్టి ప్రభాకర్,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులునాగసుబ్బయ్య, వార్డు సభ్యులు హస్తవారంసుబ్బరామిరెడ్డి, శిరీష తల్లిదండ్రులు మటన్ రమణ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 80బన్నూరు వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్.ఎల్లారెడ్డి నామినేషన్




**జూపాడు బంగ్లా, నవంబర్: 22: (నంది పత్రిక )** మండల పరిధిలోని 80 బన్నూరు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల భారీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగాఎన్. ఎల్లారెడ్డి ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్. ఎల్లారెడ్డి తన నామినేషన్ పత్రాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు అందజేశారు. వైసిపిలో ఉంటూ తనవంతుగా ప్రజలకు సొంతముగా సహాయ, సహకారాలు అందిస్తూ.. పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా, ప్రజలకు తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, విద్య, డ్రైనేజీ వ్యవస్థ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు లేని పరిస్థితులు తీసుకురావడమే తన సంకల్పమని తెలిపారు. పదవి కోసం కాదు... ప్రజల సేవ కోసం ముందుకొస్తున్న, 80 బన్నూరు పంచాయతీ అభివృద్ధికి అవకాశం కల్పించండి ఎన్. ఎల్లారెడ్డి ప్రజలను కోరారు. కుల,మత, వర్గ విభేదాలకు అతీతముగా గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, మీ ఆదరణ అభిమానమే నా బలం గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సేవ కోసం మీ అందరి ఆశీస్సులతో ముందుకు సాగుతాను.

## ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామ పంచాయతీకి రెడ్యం సోదరుల ఆధ్వర్యంలో...

### వైయస్సార్ సిపి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలు.



**ఖాజీపేట (నంది పత్రిక ) నవంబర్ 22** ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామపంచాయతీకి సంబంధించి ఆదివారం సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు వైయస్సార్ సిపి నేతలు రెడ్యం సోదరుల ఆధ్వర్యంలో చెముళ్ళపల్లె క్లస్టర్ లో నామినేషన్ లను దాఖలు చేశారు. పెద్ద ఎత్తున వైయస్సార్ సిపి శ్రేణులు పాల్గొని... జై జగన్ అంటూ కేరింతలు కొడుతూ ఉత్సవాల మధ్య నామినేషన్లు దాఖలు చేశారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు, రెవెన్యూ డివిజనల్ స్థాయిలో హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో సూచించారు.

## సీతారాంపురం గ్రామ పంచాయతీలో నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన ఎంపీడీవో ఫజుల్ రహిమాన్.

**బేతంచెర్లనవంబర్22(నందిపత్రిక).** బేతంచెర్ల మండల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, 3 వ విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, ఆదివారం బేతంచర్ల మండల ఎంపీడీవో ఎం.ఫజుల్ రహిమాన్ సీతారాంపురం గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ,ఎన్నికల విధుల నిర్వహణ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత ఎన్నికల సిబ్బందికి సూచించారు.ఎన్నికల విధుల్లో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. బేతంచర్ల మండలంలో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడు తున్నారు.

## ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్పీడీసీఎల్ గెస్ట్ హౌజ్ వద్ద ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.



**కొత్తపల్లి – నంది పత్రిక :** డిసెంబర్ నెల 2 వతేదిన గ్రామపంచాయతీలకు సర్పంచు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగానే 21 వ తేదినుంచి సర్పంచు, వార్డు స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలా చేస్తున్నారు. ఆదివారం మండలంలో రెండవరోజు నామినేషన్లు 21 సర్పంచు, 119 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలాఅయినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి దాసరి మేరి సూచించారు. ఇందులో దుద్యాల క్లస్టర్ నందు సర్పంచుకు 4. వార్డు మెంబర్లకు 51 నామినేషన్లు దాఖలాలయ్యాయని వెల్లడించారు. అదేవిధంగా కొత్తపల్లి క్లస్టర్ నందు సర్పంచుకు 4. వార్డు మెంబర్లకు 18, గోకవరం క్లస్టర్ నందు సర్పంచుకు 8, వార్డు మెంబర్లకు 29 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని తెలిపారు. వీటితో పాటు ముసలిమడుగు క్లస్టర్ నందు 5 సర్పంచు అభ్యర్థులు, 21 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలా వేసినట్లు ఆమె వెల్లడించారు.

## నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం ఆళ్లగడ్డ తాలూకా సిరివెళ్ల మండల కేంద్రంలోని వైసిపి నాయకులపై విరుచుకుపడ్డ కూటమి నాయకులు.

**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల తెలుగుదేశం నాయకులు కాబోయే సర్పంచ్ ముల్లా మహమ్మద్ హుస్సేన్ బీసీ ఫిదా హుస్సేన్ వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా అన్ని పదవులలో ఉండి సిరివెళ్ల మీరు ఏం అభివృద్ధి చేశారు ఏ అభివృద్ధి జరిగినా భూమా కుటుంబంతోనే



అని షాది ఖానా గాని కస్తూర్బా స్కూల్ గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి జరిగాయి అదే విధంగా మీ పదవులు వచ్చిన తర్వాత మీ ఇళ్లకు రోడ్డు మీ పొలాలకు రోడ్డు తప్ప మీరు చేసింది ఏమీ లేదు ప్రజలు తమ అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు తమ ఓటును తెలుగుదేశం అభ్యర్థి ముళ్ళ మహమ్మద్ హుస్సేన్ గొలుసు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అగస్తేశ్వర కోన ఆధ్యాత్మికతకు ఆలవాలం

**కడప నవంబర్ 23 (నంది పత్రిక రిపోర్టర్)**ప్రకృతి అందాలకు నిలయం!అగస్త్య మహర్షి తపోభూమిలో కొలువైన పరమశివుడు గండికోట సౌందర్యానికి మరో మణిహారం!కొండల మధ్య కొలువైన దేవుడు.. జలపాతాల సవ్వడిలో వినిపించే ప్రకృతి గానం.. పెన్నా నది పరవళ్ల మధ్య పరవశింపజేసే ఆధ్యాత్మిక అనుభూతి.. ఇవన్నీ కలగలిసిన అపురూప పుణ్యక్షేత్రమే అగస్తేశ్వర కోన.కడప జిల్లా మైలవరం మండలంలో, చారిత్రక ప్రసిద్ధి గాంచిన గండికోట లోయకు ఎదురుగా, పెన్నా నది తీరాన కొండల నడుమ ప్రకృతి ఒడిలో అలరారుతున్న ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, పర్యాటకులకు కనువిందైన ప్రకృతి సౌందర్యాన్ని అందిస్తోంది. పేరు గొప్పదనం కాదు.. పుణ్యం గొప్పదనం! అన్నట్లుగా, పెద్దపెద్ద ఆలయాల హడావుడికి దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన అగస్తేశ్వర స్వామి క్షేత్రం తనకంటూ ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని కలిగి ఉంది.

**అగస్త్య మహర్షి తపస్సుకు ప్రతీక!** స్థలపురాణం ప్రకారం.. త్రేతాయుగంలో అగస్త్య మహర్షి దక్షిణ భారతదేశ పర్యటనలో భాగంగా ఈ ప్రాంతానికి విచ్చేశారు. వింధ్య పర్వత గర్వభంగం చేసిన అనంతరం ఇక్కడి కొండల మధ్య తపస్సు ఆచరించి, పరమశివుడిని ప్రతిష్ఠించారని భక్తుల విశ్వాసం.అందుకే ఈ స్వామివారికి అగస్తేశ్వరుడు అనే పేరు ప్రసిద్ధి చెందింది. మహర్షి తపస్సుతో పవిత్రమైన ఈ ప్రాంతం నేటికీ భక్తులకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక చింతనను అందిస్తోంది. పెద్దలు చెప్పిన మాట.. పుణ్యక్షేత్ర దర్శనం మనసుకు ప్రశాంతతను ప్రసాదిస్తుంది. అందుకే ప్రకృతి ఒడిలో వెలసిన ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం ఒక మధురమైన అనుభూతి.

**ఒకే ప్రాంగణంలో పలుదైవ దర్శనం!** ప్రధాన గర్భాలయంలో అగస్తేశ్వర స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి శ్రీచక్రంతో, గణపతి, దత్తాత్రేయ స్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాలు కూడా దర్శనమిస్తాయి.ఒకే ప్రాంతంలో వివిధ దైవమూర్తులను దర్శించుకునే అవకాశం భక్తులకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.ఒకే దీపం ఎన్నో దీపాలను వెలిగించినట్లు.. ఒకే క్షేత్రం ఎన్నో దైవ దర్శనాల భాగ్యాన్ని అందిస్తోంది.

**జలపాతాల సవ్వడిలో ప్రకృతి పరవశం!**

అగస్తేశ్వర కోనకు ప్రకృతి సౌందర్యం మరో ప్రత్యేక ఆకర్షణ. ముఖ్యంగా వర్షాకాలం, శీతాకాలంలో కొండల పైనుంచి జాలువారే జలపాతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. కొండల మధ్య నుంచి ప్రవహించే నీటి ధారలు కోన అందాలను మరింత పెంచుతాయి. ఈ ప్రాంతంలో ప్రవహించే నీరు చివరకు పెన్నా నదిలో కలుస్తుంది. పచ్చని కొండలు, రాళ్ల మధ్య నుంచి పారే నీరు, పక్షుల కిలకిలారావాలు, చల్లని గాలులు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తాయి.

'నీరు పల్లమెరుగుతుంది.. ప్రకృతి తన అందాలను తానే చాటుతుంది' అన్నట్లుగా ఇక్కడి ప్రతి దృశ్యం ప్రకృతి వైభవానికి అద్దం పడుతుంది.

**గండికోట అందాలకు ఎదురుగా మరో అద్భుతం!**

గండికోటను సందర్శించే పర్యాటకులకు అగస్తేశ్వర కోన మరో అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. ఇక్కడి నుంచి అవతలి వైపు ఉన్న గండికోట కోట గోడలు, లోతైన లోయలు, పెన్నా నది పరిసరాల ప్రకృతి దృశ్యాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన గండికోట ఒకవైపు ఉంటే, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన అగస్తేశ్వర కోన మరోవైపు అలరిస్తుంది.సమీపంలోనే అత్రిముని కోన, శ్రీ విద్యా దత్త పీఠం వైపు వెళ్లేందుకు కూడా మార్గం ఉంది. దీంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటకానికి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.'చుట్టూ కొండలు ఉన్నాయని ఆకాశం అందనిదైపోదు' అన్నట్లుగా, చరిత్రను, ఆధ్యాత్మికతను, ప్రకృతి అందాలను ఒకే చోట ఆస్వాదించే అవకాశం ఇక్కడ లభిస్తుంది.

**కార్తీక మాసంలో దీపాల వెలుగులు!**

శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసంగా భావించే కార్తీక మాసంలో అగస్తేశ్వర కోనకు ప్రత్యేక శోభ సంతరించుకుంటుంది. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో ఆలయాన్ని ప్రత్యేక దీపాలంకరణలతో ముస్తాబు చేస్తారు.

భక్తులు దీపారాధనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అగస్తేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి పర్వదినాన కడప జిల్లా నలుమూలల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహిస్తారు.'దీపం చిన్నదైనా చీకటిని తొలగిస్తుంది' అన్న సామెతకు అనుగుణంగా, కార్తీక దీపాల వెలుగుల్లో ఈ కోన ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతుంది.

**పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు!**



అగస్తేశ్వర కోన కేవలం ఒక శైవక్షేత్రం మాత్రమే కాదు. ఇది ఆధ్యాత్మిక పర్యాటకం, ప్రకృతి పర్యాటకం, చారిత్రక పర్యాటకం కలిసిన అరుదైన ప్రాంతం. ఈ క్షేత్రానికి మెరుగైన రహదారి సౌకర్యాలు, సూచిక బోర్డులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, భక్తులకు విశ్రాంతి వసతులు కల్పిస్తే మరింతమంది పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. ప్రకృతి సౌందర్యానికి ఎలాంటి నష్టం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. 'ఇల్లు అలకగానే పండుగ కాదు.. ఊరు అభివృద్ధి చెందితేనే నిజమైన పండుగ' అన్నట్లుగా, ఇలాంటి అపురూప ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు స్థానిక సమాజంపైనా ఉంది.

**ముగింపు..** అగస్త్య మహర్షి తపస్సు చేసిన పవిత్ర భూమిగా భక్తుల విశ్వాసంలో నిలిచిన అగస్తేశ్వర కోన.. పెన్నా నది పరవళ్లతో, జలపాతాల జలజలలతో, గండికోట చారిత్రక వైభవంతో తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

దేవుడిని దర్శించుకుంటే భక్తి కలుగుతుంది.. ప్రకృతిని ఆస్వాదిస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది.. చరిత్రను తెలుసుకుంటే మన మూలాలపై అవగాహన పెరుగుతుంది. ఈ మూడు అనుభూతులను ఒకేచోట అందించే అద్భుత ప్రాంతం అగస్తేశ్వర కోన.మన ప్రాంతంలో ఉన్న అపురూప సంపదను మనమే గుర్తించకపోతే మరెవరు గుర్తిస్తారు?'కంటికి కనిపించే అందాన్ని ఆస్వాదించాలి.. మన నేలలో దాగిన వారసత్వాన్ని కాపాడుకోవాలి!' అగస్తేశ్వర కోనను దర్శిద్దాం.. ఆధ్యాత్మికతను ఆస్వాదిద్దాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం.. మన కడప జిల్లా వైభవాన్ని నలుదిశలా చాటుదాం!

## లెక్కల, గంగిరెడ్డి కుటుంబాల నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న రెడ్యం



**ఖాజీపేట (నంది పత్రిక ) నవంబర్ 22** మైదుకూరు: వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మండలం లెక్కలవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ మాజీ సర్పంచ్ లెక్కల శివప్రసాద్ రెడ్డి, సుదేష్ణ దంపతుల ఏకైక కుమార్తె శ్రవంతికి, ప్రొద్దుటూరు పట్టణంలోని జగతి అపార్ట్‌మెంట్స్‌కు చెందిన పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఏఈ గంగిరెడ్డి మల్లారెడ్డి, నాగవేణి దంపతుల పెద్ద కుమారుడు మాధవరెడ్డితో నిశ్చితార్థ వేడుక ఆదివారం మైదుకూరు మండలం వనిపెంట గ్రామంలోని వైఎన్ఎస్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి హాజరై కాబోయే వధూవరులకు అక్షింతలు చల్లి ఆశీర్వదించారు. నూతన జంట కలకాలం అన్యోన్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనతాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లెక్కల కవి వెంకటరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, మైదుకూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ మూలె సుధాకర్ రెడ్డి, వనిపెంట మాజీ సర్పంచ్ గౌస్ లాజాం, అంకిరెడ్డిపల్లె కొండారెడ్డి, శివరాజారెడ్డితో పాటు పలువురు బంధుమిత్రులు, ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బేతంచెర్ల మండల గ్రామ పంచాయతీల లో నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన ఎంపీడీవో ఫజుల్ రహిమాన్.



**బేతంచెర్ల నవంబర్ 22( నంది పత్రిక ).**
బేతంచెర్ల మండల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, 3 వ విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, ఆదివారం బేతంచర్ల మండల ఎంపీడీవో ఎం.ఫజుల్ రహిమాన్ సీతారాంపురం గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ,ఎన్నికల విధుల నిర్వహణ, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత ఎన్నికల సిబ్బందికి సూచించారు.ఎన్నికల విధుల్లో ఎలాంటి లోపాలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. బేతంచర్ల మండలంలో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడు తున్నారు.

# మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో విజయదుందుభి..

## పంచాయతీలలో ఆదరించండి అండగా ఉండే బాధ్యత మాదే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తాంలి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజు

**రాజంపేట( నంది పత్రికా ప్రతినిధి) నవంబర్ 22:** అభివృద్ధి కావాలంటే ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలి. ప్రజలకు సంక్షేమం, గ్రామాలకు ప్రగతి అందాలంటే డబుల్ ఇంజిన్ సర్కారు అవసరమని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన అఖండ విజయమే అభివృద్ధి పట్ల వారికున్న ఆకాంక్షకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.రాజంపేట నియోజకవర్గంలో మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి ప్రజలు ఘన విజయాన్ని అందించారని, ఈ విజయంతో తమ బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ముందున్న ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు.స్థానిక ఎన్నికల్లో విజయపరంపరను కొనసాగిస్తూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమికి ప్రజల అద్భుత మెజార్టీ అందించాలని జగన్‌మోహన్ రాజు కోరారు. మున్సిపాలిటీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లలో ప్రజలు ఇచ్చిన విజయాన్ని గ్రామ పంచాయతీల్లోనూ పునరావృతం చేస్తే అభివృద్ధికి మరింత బాటలు వేయవచ్చని పేర్కొన్నారు.రాజకీయాలకు అతీతంగా గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని తెలిపారు.స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కూటమికి బాధ్యతను గుర్తు చేస్తోందని, రాబోయే పంచాయతీ ఎన్నికలు గ్రామాల భవిష్యత్తుకు కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలపడమే తన సంకల్పమని చమర్తి జగన్‌మోహన్ రాజు స్పష్టం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ కూటమి ఐదు ఇంజిన్లను సర్కారు ఉంటే అభివృద్ధి అంటే ఏంటో ప్రభుత్వం ప్రభుత్వం చూపిస్తుందని, కావున రాబోవు పంచాయతీ ఎన్నికలలో ప్రజలు కూటమికి పట్టం కడితే గ్రామాల భవిష్యత్తు బంగారం అవుతుందని ఆయన తెలియజేశారు.



## ఆంజనేయ కొట్టాల సర్పంచ్ అభ్యర్థిగా బీజ్జం నాగ స్వర్ణలత



**ఖాజీపేట (నంది పత్రిక ) నవంబర్ 22**ఖాజీపేట: వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం ఆంజనేయ కొట్టాల,గ్రామ పంచాయతీ టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా బీజ్జం నాగ స్వర్ణలత (భర్త రామలింగారెడ్డి) నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నాగ స్వర్ణలత మాట్లాడుతూ.. పంచాయతీ ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పంచాయతీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆమె పేర్కొన్నారు.

## ప్రజా సేవకు సిద్ధం.. 5వ వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్న బేరి విజయుడు



**ఖాజీపేట (నంది పత్రిక )నవంబర్ 22** వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు గ్రామ పంచాయతీ 5వ వార్డు సభ్యుడిగా ఫ్లాస్టర్ బేరి విజయుడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బేరి విజయుడు మాట్లాడుతూ.. వార్డులోని ప్రజలందరూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల బరిలో నిలిచానని, వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## 24న ఘనంగా కార్తీక పౌర్ణమి, వన భోజన మహోత్సవం .

**రుద్రవరం ప్రతినిధి నవంబర్ 22 (నంది పత్రిక):** లక్ష్మీ గోదా సమేత శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం మరియు శ్రీ మహా త్రిపుర సుందరి సమేత శ్రీ మానసలింగేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24న కార్తీక మాస వన భోజనం మరియు కార్తీక పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు శ్రీ మానస లింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, సహస్ర బిల్వ దళార్చన, మహా మంగళహారతి, ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనము, నవగ్రహ మంటప ఆరాధన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 8 గంటల నుండి శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ రుద్ర, నవగ్రహ, శ్రీ సుదర్శన హోమాలు మరియు పూర్ణాహుతి జరిపించబడతాయి. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ, సాయంత్రం 6 గంటలకు కోటి దీపాలంకరణ కార్యక్రమం కనులపండువగా జరగనుంది. వేడుకలకు విచ్చేసే భక్తుల కోసం ఉదయం 8 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్న ప్రసాద వితరణ, రాత్రి 7 గంటలకు అల్పాహార ఏర్పాట్లు చేశామని, కావున భక్తాదులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## సిరివెళ్ల గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**సిరివెళ్ల (నంది పత్రిక)**



ప్రజా సేవే పరమావధిగా గ్రామ అభివృద్ధి ధ్యేయంగా వైఎస్ఆర్సిపి సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న నన్ను మరియు మా 18 వార్డు సభ్యులను అఖండ మెజారిటీతో గెలిపించాలని సిరివెళ్ల వైఎస్ఆర్సిపి సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన నాయక్ ముజాఫర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈరోజు సిరివెళ్ల మండల కేంద్రంలో వైసీపీ శ్రేణులతో కలిసి సర్పంచ్ అభ్యర్థి నాయక్ మజా ఫర్ హుస్సేన్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సిరివెళ్ల గ్రామ పంచాయతీకి సర్పంచ్ గా పోటీ చేస్తున్న తనకు ఎన్నికల సంఘం క్యారెట్ గుర్తును కేటాయించిందని తెలిపారు.సిరివెళ్ల గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధం త్రాగునీరు రోడ్లు మురికి కాల్వల ప్రక్షాళన చేసి సిరివెళ్ల గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామపంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్ కూడా ఏర్పాటు చేస్తానని అప్పటికి ఉన్నటువంటి 18 వార్డులను అభివృద్ధి చేసి ఆయా అవార్డులలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించి జిల్లాలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలబెడతానని హామీ ఇచ్చారు. అలాగే సిరివెళ్ల మండల కేంద్రంలో ఒక నీటి ట్యాంకి నిర్మాణం కూడా చేయిస్తామని తద్వారా ప్రజలకు త్రాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. రాజకీయాలలో చేరెందుకు తన వద్ద డబ్బు లేకపోయినా ప్రజల ప్రేమాభిమానాలు తనకు మెండుగా ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచిన తనను సిరివెళ్ల మండల కేంద్రంలోని 18 వార్డుల ప్రజలు తమ ప్రేమాభిమానాలను చూపిస్తూ వారి యొక్క అమూల్యమైన ఓటును తనకు కేటాయించిన క్యారెట్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని మీడియా ముఖంగా కోరారు. ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద పాల్గొన్నారు.

## సునీహ గెలుపు కోసం నల్లేరు దంపతుల ప్రచారం

**పోరుమామిళ్ల, నవంబర్ 22 (నంది పత్రిక):**బద్వేల్ నియోజక వర్గంలోని పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థి షేక్ సునీహ విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి, ఆయన సతీమణి రామలక్ష్మీ దేవి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో భాగంగా టిప్పర్ గౌస్ వీధి, వాసవి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ, పోరుమామిళ్ల అభివృద్ధి కోసం సర్పంచ్ అభ్యర్థి షేక్ సునీహకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## మండగిరిలో టీడీపీ అభ్యర్థి శ్రీదేవికి మద్దతుగా విస్తృత ప్రచారం.

## అత్యధిక మెజారిటీతో గెలిపించాలి జనసేన మల్లప్ప, కొంకా సిద్ధార్థ నాయుడు.

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని మండలం మండగిరి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న టీడీపీ నాయకులు బుద్ధారెడ్డి సతీమణి శ్రీదేవికి మద్దతుగా జనసేన నాయకులు మల్లప్ప, యువ నాయకులు కొంకా సిద్ధార్థ నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలను, ఓటర్లను కలిసి టీడీపీ అభ్యర్థి శ్రీదేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ అభ్యర్థుల విజయమే బాటలు వేస్తుందని ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలిచి ఘనవిజయం అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్ మనోహరయ్య, బాబు నాయుడు, శ్రీనివాస చౌదరి, చాంద్ భాషా, నాగన్న, అనిమిరెడ్డి, జనసేన నాయకులు పులి రాజు తదితరులు పాల్గొన్నారు.



# మండల పరిషత్ కార్యాలయం చేరిన పంచాయతీ ఎన్నికల మెటీరియల్ .

## పోలింగ్ స్టేషన్ల వారీగా బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు.



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 22 (నంది పత్రిక): ఈనెల 26న జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల మెటీరియల్ ఆదివారం మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలలో పోలింగ్ స్టేషన్ల వారీగా సర్పంచ్, వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలను వేరుగా సిద్ధం చేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా సిద్ధం చేసిన బ్యాలెట్ పత్రాలను భద్రపరచడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో రుద్రవరం మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా యర్రగుడిదిన్నె గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయిందని, 16 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 20 గ్రామపంచాయతీలకు సంబంధించి 52 మంది సర్పంచ్ అభ్యర్థులు, 406 మంది వార్డు సభ్యులు పోటీలో ఉన్నారని ఎంపీడీవో తెలిపారు. గ్రామ పంచాయతీల నందు పోలింగ్ స్టేషన్ల వారీగా భద్రపరచిన సర్పంచు, వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలు పోలింగ్ నిర్వహణకు సంబంధించిన మెటీరియల్ పోలింగ్ కు ముందు రోజు పోలింగ్ నిర్వహణ అధికారులకు అప్పగించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

# సాదాపురంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థికి ఉమాపతి నాయుడు మద్దతు.

## ఇంటింటా ప్రచారం నిర్వహించి విజయానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి.



ఆదోని ఆదోని మండలం సాదాపురం గ్రామంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి, టీడీపీ మద్దతుతో గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న కరణం సంధ్యకు మద్దతుగా టీడీపీ సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కూటమి అభ్యర్థి కరణం సంధ్యకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి విజయానికి గ్రామ ప్రజలు సహకరించి, ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థికి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, అడ్వకేట్ నాగేంద్ర, రంగన్న, కృష్ణారెడ్డి, కిష్టప్ప, శీను తదితరులు పాల్గొన్నారు.

# రంగసముద్రం అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి:

## వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థి పార్కుల పునరుద్ధరణ, పారిశుధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి



పోరుమామిళ్ల, నవంబర్ 22 ( నంది పత్రిక):వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి మద్దతు కోరారు.ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేశామని తెలిపారు. ప్రస్తుతం పార్కులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. చెత్త సేకరణ వాహనాల నిర్వహణ కూడా సక్రమంగా లేదన్నారు. తనను గెలిపిస్తే పార్కులను పునరుద్ధరించి, పారిశుధ్య సమస్యలను పరిష్కరించి రంగసముద్రం పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో గిరి ప్రణీత్ రెడ్డి, ఎంపీటీసీ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ఆదిత్య రెడ్డి, చాపాటి నారాయణరెడ్డి, రుద్రవరం రాము, మాజీ జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా నామినేషన్లు.. అధికారులకు నాగార్జున రెడ్డి అభినందనలు



పోరుమామిళ్ల, నవంబర్ 22 :(నంది పత్రిక ): బద్వేల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంపై మాజీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని చెదురుమదురు సంఘటనలు మినహా నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేసిందన్నారు. జిల్లా ఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోరుమామిళ్ల ఎస్ఐ విద్యాసాగర్, సీఐ సుబ్రహ్మణ్యం తమ పరిధిలో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు.ఈ నెల 26న జరగనున్న సర్పంచ్ ఎన్నికలను కూడా నిష్పక్షపాతంగా నిర్వహించి, ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని పోలీసు అధికారులను కోరారు. ఇవి పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కాకుండా వ్యక్తిగత ప్రాతిపదికన జరిగే ఎన్నికలని, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారని పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో మొదటి నుంచి ప్రశాంతమైన ఎన్నికల వాతావరణం కొనసాగుతోందని, గతంలోనూ నాయకులు, అధికారులు సమన్వయంతో ఎన్నికలు నిర్వహించారని గుర్తుచేశారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ అన్ని పార్టీల నాయకులు సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల అనంతరం కూడా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని నాగార్జున రెడ్డి ఆకాంక్షించారు.

# కాటసాని రామిరెడ్డి సమక్షంలో టిడిపి నుండి వైఎస్సార్‌సీపీలో చేరిక

## క్రిష్ణగిరి గ్రామానికి చెందిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే



బనగానపల్లె, నవంబర్ 22నందిపత్రిక బనగానపల్లె పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో క్రిష్ణగిరి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రిష్ణగిరి గ్రామపంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నందిగారి మాధవ కృష్ణారెడ్డి, ఈడిగ రమణయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎర్రగుడి బాల తిమ్మయ్య, గోనవరం రాము తలారి పెద్ద మదిలేటి తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఎర్రగుడి బాల తిమ్మయ్య, గోనవరం రాము తలారి పెద్ద మదిలేటి లు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా టీడీపీకి సేవలందిస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచి, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశామని తెలిపారు. అయితే పార్టీలో కష్టపడే సామాన్య కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వం, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాటసాని రామిరెడ్డి మాట ఇస్తే సామాన్య కార్యకర్తలను సైతం అన్ని విధాలా ఆదుకుంటారని, కాటసాని కుటుంబం తమను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబులరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి తదితరులు పార్టీ కోసం అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నాయకత్వంపై నమ్మకంతోనే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు.

# వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భక్తుల ప్రత్యేక యాత్ర

## కలశాలతో 150 మందికి పైగా భక్తుల పాదయాత్ర

## రైతుల కష్టాలు తొలగి భూములు సస్యశ్యామలం కావాలని ప్రార్థనలు



బనగానపల్లె, నవంబర్ 22, నందిపత్రిక ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, నవంబర్‌డిసెంబర్ నెలల్లోనైనా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ 150 మందికి పైగా భక్తులు కలశాలతో ప్రత్యేక యాత్ర చేపట్టారు.బనగానపల్లె పట్టణంలోని శ్రీ హట్టి ముని స్వామి దేవస్థానం నుంచి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు కలశాలతో నందవరం హట్టి మునుస్వామి మఠానికి బయలుదేరారు. దొంతా వెంకటేశ్వర్లు చేపట్టిన చాతుర్మాస దీక్ష అనంతరం, ఆయన పర్యవేక్షణలో ఈ యాత్ర ప్రారంభమైంది.ఈ సందర్భంగా భక్తులు వర్షాలు సమృద్ధిగా కురిసి భూములు సస్యశ్యామలంగా మారాలని, రైతుల కష్టాలు తొలగి పంటలు పుష్కలంగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు. లోక కల్యాణం, రైతుల సంక్షేమం ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో ఈ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురూజీ రామశేషయ్య, రవికుమార్, విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా సంయోజకురాలు శ్రీమతి గంగాభవానీ దేవి, విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత జిల్లా ప్రముఖ్ గెలగాని ఓబుల్ రెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## "అలెక్స్, ఎక్కడున్నావు?"..

వారణాసిలోని దారానగర్ ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం తమ పెంపుడు రామచిలుక తప్పిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతోంది. గత పదేళ్లుగా తమ ఇంట్లో ఓ సభ్యురాలిగా కలిసిపోయిన 'అలెక్స్' అనే ఆడ చిలుక కోసం వీధివీధినా గాలిస్తున్నారు. దాని ఆచూకీ కనిపెట్టి తమకు అప్పగించిన వారికి రూ. 11,000 నగదు బహుమతి ఇస్తామని ప్రకటిస్తూ నగరంలో పోస్టర్లు ఏర్పాటు చేశారు.

# రంగసముద్రం పంచాయతీ అభివృద్ధికి సహకరించండి.. సర్పంచ్ అభ్యర్థిగా పసుపుల శృతి

## వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పసుపుల శృతి.. ఎన్నికల గుర్తు వంకాయ



పోరుమామిళ్ల నవంబర్ 22( నంది పత్రిక):కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని పోరుమామిళ్ల, రంగ సముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పసుపుల శృతి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా నవంబర్ 26, 2026న జరగనున్న ఎన్నికల్లో తన ఎన్నికల గుర్తు వంకాయపై ఓటు వేసి తనకు మద్దతు ఇవ్వాలని ఆమె ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. రంగసముద్రం మాజీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మార్గదర్శకంలో గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం, ఆశీస్సులు అందించాలని కోరుతున్నారు. ఎన్నికల్లో వంకాయ గుర్తును గుర్తించి తమ అమూల్యమైన ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎర్రగుంట్ల గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. రిహానా బేగం ముజాహిద్ దంపతులు.

సిరివెళ్ల. (నంది పత్రిక) సిరివెళ్ల మండలం పరిధిలోని ఎర్రగుంట్ల మేయర్ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కట్టమీద రిహానా బేగం ముజాహిద్ దంపతులకు మంచం గుర్తు కేటాయించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించడంతో విస్తృత ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగుంట్ల గ్రామ అభివృద్ధి కోసం పేదలకు అండగా నిలిచేందుకు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చేసేందుకు రిహానా బేగం దంపతులు ముందుకు వచ్చామని తెలిపారు. అందుకే ఎర్రగుంట్ల గ్రామ ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మంచం గుర్తుకు ఓటు వేసి రిహానా బేగం దంపతులను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు తెలిపారు..

# ఆదరించండి అభివృద్ధి చేసి చూపుతాం..!

## చిప్పగిరిలో పోటా పోటీగా సర్పంచ్ ఎన్నికల ప్రచార హోరు

## ప్రచారంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కూటమి, వైఎస్సార్సీపీ సర్పంచ్ అభ్యర్థులు



ఆదోని నంది పత్రిక ప్రతినిధి తమను ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతామని చిప్పగిరి సర్పంచ్ కూటమి వైఎస్ఆర్సిపి అభ్యర్థులు ఎల్లంకి రజిని,లిఖిత రెడ్డి చెప్పారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో చిప్పగిరిలోని ఎస్సీ కాలనీ,మాల వీధి,కొండేగేరి,కురవ కాలనీ,వడ్ల వీధి,గోవిందప్ప స్వామి కాలనీ నందు వారు వేరువేరుగా విస్తృతంగా పర్యటించి ఇంటింటికి వెళ్లి తమకు కేటాయించిన మంచం,ఉంగరం గుర్తులపై ఓటు వేసి వేయించి గెలిపించాలని వారు కోరారు.ఈ ప్రచారానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది.గ్రామంలో ప్రధాన సమస్యలైన త్రాగునీరు,రోడ్లు,డ్రైనేజీ నిర్మాణం తదితర పనులను తక్షణమే ప్రాధాన్యత ఇచ్చి గెలిచిన వెంటనే తీరుస్తామని వారు హామీ ఇచ్చారు.ప్రచారంలో బిజెపి జిల్లా నాయకులు తిమ్మప్ప,ఎల్లంకి నాగరాజు,అమరేష్,సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొండా రామాంజనేయులు,దాసరి గోవిందరాజులు,ఎల్లంకి ప్రసాద్, బలరాం,అశోక్,బర్మె లక్ష్మీనారాయణ,గద్దల రామకృష్ణ,డీలర్ రామయ్య,ఎర్ర రామచంద్ర,రమాదేవి,సంధిరెడ్డి చందన,సంధి రెడ్డి వెంకటరమణ,కత్తిమాల రాజీ,రమ్య,వేణి,నందిని తదితరులు పాల్గొన్నారు. వైయస్సార్ సిపి పార్టీ నుండి ప్రచారంలోఎంపీటీసీలు మహానంది,సర్వర్ ఖాన్, మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి,డాక్టర్ కీర్తి కిరణ్ రెడ్డి,మాజీ ఎంపిటిసి మల్లికార్జున,లోకనాథ్,పెద్ద పెద్దయ్య,డేగలపాడు ఈరప్ప,కేసరి నల్లన్న,సుధీర్ రెడ్డి,కేసరి సూరి,కొండా కృష్ణమూర్తి,అంపన్న,గురు శ్రీధర్, కొక్కనాగరాజు,జిఎస్.నెట్టికంటయ్య,జిఎస్లక్ష్మీనారాయణ,అంజి,చెరువుసత్తన్న,మక్కుల్,కొండా రామాంజనేయులు,వినోద్,మనోహర్,కాకర్ల సత్తన్



# రెండవ రోజు జోరుగా నామినేషన్లు దాఖలు

## సర్పంచ్ స్థానాలకు 35 మంది. వార్డు సభ్యులకు 239 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

జూపాడుబంగ్లా, నవంబర్ :22: (నంది పత్రిక) గ్రామపంచాయతీల ఎన్నికల నిర్వహణలో భాగంగా జూపాడుబంగ్లా మండలంలోని గతంలో ఎన్నడూ లేని విధంగా మూడో విడత గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో జూపాడుబంగ్లా మండలంలోని ఉన్న 12 గ్రామపంచాయతీలకు గాను రెండోవ రోజైన ఆదివారం సర్పంచ్ స్థానాలకు 32 మంది. వార్డు సభ్యుల స్థానాలకు 239 మంది అభ్యర్థుల నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలు అవుతున్న నామినేషన్ల సంఖ్యను చూస్తుంటే జూపాడుబంగ్లా మండలం ప్రజలకు అసలైన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వచ్చిందన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా సాగుతుందని ఎంపీడీవో తెలిపారు.



## ప్రధాని పాల్గొననున్న డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి

# కాన్ఫరెన్స్‌కు టీం వర్క్ తో పని చేయాలి





**వివిధ కమిటీలకు అప్పజెప్పిన బాధ్యతలకు సూక్ష్మస్థాయి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి**

**అధికారులకు కేటాయించిన విధులలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరాదు**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి, బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** డిసెంబర్ మొదటి వారంలో తిరుపతి జిల్లాలో నిర్వహించనున్న డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ కు గౌరవ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి పాల్గొననున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో టీం వర్క్ తో పని చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, డీజీపీలు, ఐజీపీల జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ తొలిసారిగా రాజధాని అవతల జరుగుతున్న కార్యక్రమమని, ఈ కార్యక్రమం చాలా ప్రాధాన్యత సంతరించుకున్నదన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గాను అకామిడేషన్ , రిసెప్షన్ అండ్ సి ఆఫ్, క్యాటరింగ్, ట్రాన్స్పోర్టేషన్, బ్యూటిఫికేషన్, శానిటేషన్,మెడికల్ అండ్ హెల్త్, ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రికల్ సేఫ్టీ అండ్ విజిలెన్స్, యోగ, కమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, పోలీస్, జిల్లా స్థాయి అధికారులను ఇన్చార్జిలుగా నియమించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి వారు చేపట్టాల్సిన విధులు మరియు బాధ్యతలకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ చేశామన్నారు.ఆ ఉత్తర్వులకు అనుగుణంగా అధికారులకు కేటాయించిన విధులన్నింటిని అత్యంత శ్రద్ధతో, జాగ్రత్తతో నిర్వహించాలన్నారు. ప్రతి అంశాన్ని కూడా సూక్ష్మస్థాయి పరిశీలన జరిపి వసతిఏర్పాటు నుంచి సదస్సు నిర్వహణ ప్రదేశం వరకు చేపట్టాల్సిన పనులన్నింటిని సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి విధులు కేటాయించిన ఇతర శాఖల అధికారులతో ఓవరాల్ ఇన్చార్జ్ మరియు నోడల్ అధికారులు అంతర్గత సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే జాతీయ స్థాయి ప్రముఖుల వసతి మరియు సదస్సు నిర్వహణ ప్రాంతాల్లో నిరంతర విద్యుత్తు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.నగరంలో రోడ్ల సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రవాణా, విద్యుత్, వైద్య, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఐసర్ ( ఐ ఎస్ ఈ ఆర్), ఐఐటీ ( ఐఐటీ), ఇండియన్ కులినరీ ఇన్స్టిట్యూట్ (ఐ సి ఐ)లలో చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలించేందుకు అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్ నిర్వహణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలని, వివిధ శాఖలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ మరియు వెన్యూ ప్రాంతాలలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం.జయకృష్ణ,అసిస్టెంట్ కమిషనర్ శారదాదేవి, డీఆర్ఓ జి. నరసింహులు,ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ రాజా నాయక్, వివిధ శాఖల అధికారులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డిఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, అదనపు ఎస్పి లు రవి మనోహరాచారి, రామ కృష్ణ, శ్రీలత, డిఎస్పి లు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి నిత్య అన్నదాన భవన నిర్మాణానికి

# రూ.20 వేల విరాళం

### దాత కుటుంబానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు



**బనగానపల్లె, నవంబర్ 22, నందిపత్రిక** మండలంలోని టంగుటూరు గ్రామ పొలిమేరలో కొలువు దీరిన శ్రీ టంగుటూరు పెద్దమ్మతల్లి ఆలయంలో నిత్య అన్నదాన భవన నిర్మాణానికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తున్నారు.ఆదివారం నంద్యాల జిల్లా సంజామల మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన నెమలి లక్ష్మీనారాయణరెడ్డి, ఆయన ధర్మపత్ని పద్మావతి, కుమారులు భువనేశ్వరరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డిలు అమ్మవారిపై ఉన్న భక్తితో నిత్య అన్నదాన భవన నిర్మాణానికి రూ.20,000 నగదును విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాత కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ పెద్దమ్మతల్లి ఆశీస్సులు నెమలి లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబ సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరారు.

## వైసీపీ అభ్యర్థులు ప్రచారం చేస్తుండగా దాడి

## పలువురికి గాయాలు





**చాగలమర్రి నవంబర్ 22 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలో ఆదివారం వైసీపీ 17 వ వార్డు సభ్యునిగా పోటీ చేస్తున్న షాహిన్ ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. కర్రలతో దాడి చేయడంతో ఈ దాడిలో 7 మంది వైసీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఉయ్యాలవాడ మండలం పెద్దయ్యమ్మనూరు ఘటనను మరిచిపోక ముందే మరో మారు చాగలమర్రి లో వైసీపీ కార్యకర్తలపై దాడి జరగడాన్ని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. క్షతగాత్రులను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు.





## మహానంది పుణ్యక్షేత్రంలో

## డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పూజలు



**మహానంది నవంబర్ 22 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా దర్శించుకున్నారు. ముందుగా ఈయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకార్చన పూజలు నిర్వహించుకున్నారు. తన అనంతరం ఏఈఓ మధు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించగా, వేదపండితులు వేదఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహానంది క్షేత్రంలో అలరించిన

## కూచిపూడి నాట్య నివేదన




**మహానంది నవంబర్ 22 (నంది పత్రిక):-**మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీ కామేశ్వరీ సమేత శ్రీ మహానందీశ్వర స్వామి వారి సన్నిధిలో హైదరాబాదుకు చెందిన 'గౌరీ శంకర్ నాట్యాలయ కూచిపూడి నృత్య అకాడమీ' కళాకారులు భక్తిశ్రద్ధలతో నాట్య నివేదన సమర్పించారు. గురువు పెరవలి కేదారనాథ్ నేతృత్వంలో వారి శిష్య బృందం ప్రదర్శించిన శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానం తరపున ఏఈవో మధు, కుమార్తె ఆలయ అధికారులు గురువు కేదారనాథ్ గారిని, శిష్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి, శ్రీ స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, మహా ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు.

# నీతి నిజాయితీకి మారుపేరు ఎ చక్రపాణి యాదవ్

**శాసనమండలి మాజీ చైర్మన్ ఎ చక్రపాణి యాదవ్ సంతాప సభ**

**చక్రపాణి యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు**

**మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్**



**కర్నూలు సిటీ నంది పత్రిక** శాసనమండలి మాజీ చైర్మన్ అప్పన బోయిన చక్రపాణి యాదవ్ సంతాప సభ కర్నూల్ నగరం మౌర్య ఇన్ విభూ పరిణయ ఫంక్షన్ హాల్ నందు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సంతాప సభకు ముఖ్య అతిథులుగా హాజరైన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో చక్రపాణి యాదవ్ లాంటి వారు అరుదుగా ఉంటారని, సామాజిక అభివృద్ధి, శాసన మండలి ఏర్పాటులో తనదైన శైలిలో సభ నిర్వహిస్తూ క్రమశిక్షణకు నైతిక విలువలకు కట్టుబడి పని చేశారని, తన 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారని కొనియాడారు. వీరి ఆశయాలు స్ఫూర్తి దాయకమని కొనియాడారు. క్రమశిక్షణ రాజ్యాంగ విలువల పట్ల అపారమైన నమ్మకం ఉన్న వారి జీవితం భావితరాల వారికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కర్నూలు నగరంలో మన జిల్లా వాసి అయిన శాసన మండలి మాజీ చైర్మన్ చక్రపాణి యాదవ్ విగ్రహా ఏర్పాటుకు కుటుంబ సభ్యులు, బీసీ సంఘాలు యాదవ సంఘం నాయకుల కోరిక మేరకు ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ సభను ఉద్దేశించి హామీ ఇచ్చారు. ఏఐసిసి సభ్యులు కర్నూలు జిల్లా ఇన్చార్జి, కాంగ్రెస్ పార్టీ పాన్యం నియోజకవర్గ కోఆర్డినేటర్ జె లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ నిజంగా టీజీ వెంకటేష్ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఈ జిల్లాలో బాధ్యతగా పార్టీలకు అతీతంగా చక్రపాణి యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి సంతాప సభ ఏర్పాటు చేయడం టీజీ కుటుంబానికి చక్రపాణి యాదవ్ కు ఎంత అనుబంధం ఉందో అనేది. తెలుస్తుందన్నారు. టీజీ వెంకటేష్ టీజీ భరత్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఒక సాధారణమైన కుటుంబంలో నుంచి వచ్చి అంచలంచలుగా ఎదుగుతూ ఎంతో మంది ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ఎంతోమంది ముఖ్యమంత్రులతో కేంద్ర మంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఒక న్యాయవాదిగా కాంగ్రెస్ పార్టీలో కరడుగట్టిన కాంగ్రెస్ వాదిగా ఆయన సేవలు అందించి అన్ని పార్టీల మద్దతు కూడా గట్టి రాష్ట్రము విడిపోయిన తర్వాత కూడా శాసనమండలి చైర్మన్ గా కొనసాగించడం నిజంగా తన వ్యక్తిత్వానికి నీతి నిజాయితీకి మారుపేరు అని లక్ష్మీ నరసింహ యాదవ్ కొనియాడారు. కర్నూల్ నగరంలో చక్రపాణి యాదవ్ విగ్రహ ఏర్పాటుకు హామీ ఇచ్చిన మంత్రి టీజీ భరత్ కి లక్ష్మీనరసింహ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు త్వరలో ఆయన స్వగ్రామం హుసేనాపురంలో సంతాప సభ ఏర్పాటు చేసి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీ తరపున పెద్దల సహకారంతో ఏర్పాటు చేస్తామని లక్ష్మీ నరసింహ యాదవ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, యాదవ సంఘం పెద్దలు బి తిమ్మయ్య యాదవ్, బాల మద్దయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, పోతుల నాగరాజు యాదవ్, వెంకటరమణ యాదవ్, దేవ శంకరయ్య యాదవ్, శేషఫని యాదవ్, సింధు నాగేశ్వరరావు యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, కే బాబురావు, సి మోహన్ రావు యాదవ్, బి బాలకృష్ణ యాదవ్, సాంబశివుడు, సుంకన్న, చక్రపాణి యాదవ్ కుటుంబ సభ్యులు కుమారుడు శశికాంత్ యాదవ్ కుమార్తెలు డాక్టర్ కళ్యాణి, నీరజ, అల్లుళ్ళు రమేష్, జయదేవ్, మనవళ్లు మహీధర్, ఉజ్వల్ సాయి, జాహ్నవి, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## 18 వార్డు కార్పొరేటర్ గా అంబిలి కాశీ విశ్వనాథ్ నేడు ప్రమాణ స్వీకారం

### 18 వ వార్డు నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి ర్యాలీని జయప్రదం చెయ్యండి

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో 18వ వార్డు ప్రజల ఆశీర్వాదం, ఆదరణతో ఎన్నికైన 18వ వార్డు కార్పొరేటర్ అంబిలి కాశీ విశ్వనాథ్ అనే నేను, సోమవారం (23-11-2026) నిర్వహించనున్న ప్రమాణ స్వీకారోత్సవానికి 18వ వార్డు ప్రజలకు, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం.ఉదయం 9:00 గంటలకు బీజేపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి, అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న గల్లీలోని కర్నూలు మున్సిపల్ హాల్‌కు చేరుకుని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుంది. ఎన్ డి ఏ కూటమి (బీజేపీటీడీపీజనసేన) నాయకులు, కార్యకర్తలు, 18వ వార్డు ప్రజల సమక్షంలో ప్రజాసేవకు అంకితమవుతున్న ఈ శుభ సందర్భంలో, మీ అందరి హాజరు, ఆశీర్వాదాలు, ఆదరణ అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ అనే ఆశయంతో, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ కలుపుకుంటూ, 18వ వార్డు అభివృద్ధికి, ప్రజాసేవకు నిరంతరం కృషి చేస్తానని సంకల్పిస్తున్నాను.



## మాజీ శాసనమండలి చైర్మన్ చక్రపాణికి

## మంత్రి టీజీ భరత్ నివాళులు



**కర్నూలు సిటీ నందిపత్రిక** మాజీ శాసనమండలి చైర్మన్ దివంగత డాక్టర్ అప్పనబోయిన చక్రపాణి స్మారకార్థం కర్నూలు నగరంలోని మౌర్య ఇన్‌లో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ప్రమాదంలో గాయపడిన జనసేన నాయకుడు

## తిమ్మప్పకు పరామర్శ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం అంబేద్కర్ నగర్‌లో జనసేన పార్టీ నాయకుడు తిమ్మప్ప ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న కోడుమూరు జనసేన పార్టీ సమన్వయకర్త సంధ్య విక్రమ్ కుమార్ హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. తిమ్మప్పను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దిన్నదేవరపాడుకు చెందిన సీనియర్ జనసేన నాయకులు, రాయలసీమ జనసేన పార్టీ కార్యనిర్వాహక సభ్యులు లక్ష్మన్న, శ్రీను, సూరి తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.




Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ‘విద్య‘తో వెలుగులు నింపుతూ.. ‘సేవ‘తో వేలాది జీవితాల్లో మార్పు తెస్తున్న ‘అశోక్ వర్ధన్ రెడ్డి‘..

## అశోక ఫౌండేషన్ ద్వారా నిత్యం సేవా కార్యక్రమాలు



**కర్నూలు సిటీ నంది పత్రిక** ఒక ‘మహిళ‘ విద్యావంతురాలైతే ఒక ‘కుటుంబం‘ అభివృద్ధి చెందుతుంది.. ఆ ‘కుటుంబం‘ ద్వారా రాబోయే తరాలు కూడా ‘మంచి భవిష్యత్తు‘ను నిర్మించుకుంటాయి“ అనే బలమైన నమ్మకంతో ‘మహిళా విద్య‘కు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ‘అశోకా‘ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీని రాష్ట్రంలోనే ‘నెం. 1‘ ఉమెన్స్ కాలేజీ స్థాయికి చేర్చిన మహోన్నత వ్యక్తి చైర్మన్ కె అశోక్ వర్ధన్ రెడ్డి‘.. నేడు విద్యారంగంతో పాటు సామాజిక ఆధ్యాత్మిక సేవలలోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.మహిళలకు నాణ్యమైన విద్య అందించి, మహిళా సాధికారతే ధ్యేయంగా ఆయన తీర్చిదిద్దిన ఈ విద్యాసంస్థ ద్వారా ఇప్పటివరకు 8,000 మందికి పైగా విద్యార్థినులు విద్యను అభ్యసించి, తమ జీవితాల్లో మంచి అవకాశాలను అందిపుచ్చుకుని, సమాజంలో ఉన్నత స్థాయిలో కొలువుదీరారు. ఒక విద్యాసంస్థను స్థాపించడమే కాకుండా, మహిళల జీవితాల్లో ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబన, సమాజంలో గౌరవం పెంపొందించాలనే ఆయన ఆలోచన ఎంతో మందికి ఆదర్శనీయం.విద్యతో పాటు సమాజానికి సేవ చేయాలనే తపనతో ఆయన స్థాపించిన ‘అశోకా ఫౌండేషన్‘ ద్వారా నిత్యం అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. కర్నూలులోని అనాథాశ్రమాలకు ఆహారం, దుప్పట్లు, దుస్తులు అందించడం; లక్ష్మీపురంలోని ప్రభుత్వ పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం; ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలు ఆయన సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దూపాడు పరిసర గ్రామాల్లో ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రజలకు సేవలందిస్తున్నారు. విజయవాడలో వరదలు సంభవించిన సమయంలో బాధితులకు అండగా నిలిచి సహాయం అందించారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించడం ఆయనలోని మానవత్వానికి ప్రతీక.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ‘డిజిటల్ అక్షరాస్యత‘ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తూ, గ్రామీణ మహిళలకు కుట్టు శిక్షణ అందించి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు వినాయక విగ్రహాలను అందించడం, రెడ్ క్రాస్ సంస్థ అవసరమైనప్పుడు రక్తదాన శిబిరాలను నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు తన సేవలను విస్తరిస్తున్నారు.ప్రతీ యేడాది ‘మహిళా దినోత్సవం‘ సందర్భంగా “సాచీ(సాచి )” పేరుతో సమాజ సేవలో విశేష కృషి చేసిన మహిళల సేవలను గుర్తించి సత్కరించడం ఆయన చేపడుతున్న మరో గొప్ప కార్యక్రమం. సేవ చేసిన మహిళలను గౌరవించడం ద్వారా యువతకు స్ఫూర్తినిస్తూ, సమాజంలో మహిళల సేవలకు తగిన గుర్తింపు కల్పిస్తున్నారు.అన్ని మతాల పట్ల సమాన గౌరవం కలిగి ఉండాలనే ఆయన భావన ‘అశోకా‘ కళాశాలలో నిర్వహించే పండుగలు, కార్యక్రమాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అన్ని మతాలకు చెందిన ముఖ్యమైన పండుగలను సమాన గౌరవంతో నిర్వహిస్తూ, వివిధ మతాల పెద్దలను కళాశాలకు ఆహ్వానించడం ద్వారా మతసామరస్యం, ఐక్యత, మానవత్వం అనే విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తున్నారు. తన ఉద్యోగులను కూడా కుటుంబ సభ్యులుగా భావించే ఆయన, మహిళా ఉద్యోగులకు ఉచిత వసతి, ‘అశోకా‘ సిబ్బంది అందరికీ ఫ్రీగా ‘వర్కింగ్ లంచ్‘, ‘ఆరోగ్య బీమా‘, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సిబ్బందికి సహాయం అందిస్తున్నారు. ‘ఉన్నత విద్య‘ అభ్యసించాలనే ఆసక్తి ఉన్న ఉద్యోగులను ప్రోత్సహిస్తూ ‘పీహెచ్‌డీ‘ వంటి ఉన్నత విద్యకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. అధ్యాపకులు, ఉద్యోగులు తమ వృత్తిపరమైన, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకు నేందుకు అవసరమైన సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు, రిఫ్రెషర్ సెషన్లను కూడా నిర్వహిస్తున్నారు.ఆయన స్థాపించిన విద్యాసంస్థ, చేపడుతున్న సేవా కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,000 మందికి పైగా ఉపాధి పొందుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒక సంస్థను నడపడమే కాకుండా, అనేక కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తూ, ఉద్యోగుల సమస్యలను తన కుటుంబ సమస్యలుగా భావించి పరిష్కరించేందుకు ముందుకు రావడం ఆయన నాయకత్వంలోని ప్రత్యేకత.మా చైర్మన్ కేవలం ఒక సంస్థ అధిపతి మాత్రమే కాదు..

వేలాది మంది విద్యార్థినుల భవిష్యత్తుకు మార్గదర్శి, ఎన్నో కుటుంబాలకు ఆశాకిరణం, సమాజ సేవకు అంకితమైన వ్యక్తి, ‘అశోకా‘ కుటుంబ సభ్యులందరికీ ఒక పెద్ద దిక్కు ఆయన చూపుతున్న ప్రేమ, ఆదరణ, ప్రోత్సాహం, సహాయం మాటల్లో చెప్పలేనివి. ఆదివారం కార్తీక వన భోజన కార్యక్రమం అశోక మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ‘అశోకా‘ కుటుంబ సభ్యులమంతా కలిసి కళాశాల చైర్మన్ అశోక్ వర్ధన్ రెడ్డి ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ ఘనంగా సత్కరించారు ఆయన ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఇంకా ఎన్నో మంచి సేవలు అందించాలని, ఆయన ఆశయాలు మరెన్నో తరాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకున్నారు.

# అభివృద్ధి కోసమే కూటమికి పట్టం కట్టిన ప్రజలు.

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 22 నంది పత్రిక**రాష్ట్రంలో సాఫీగా అభివృద్ధి జరగాలంటే కూటమి ప్రభుత్వం నగరాల నుండి గ్రామ స్థాయి వరకు అన్ని పదవులలో అధికారంలో ఉండాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల స్థానిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం మరోమారు ప్రభంజనం సృష్టించిందని అన్నారు. స్థానిక సంస్థల్లో మొదటి ఫేసులో నంద్యాల ఆళ్లగడ్డ ఉండడం జరిగిందని ఇందులో భాగంగా 29 ఏకగ్రీవాలు అయితే అందులో 27 ఆళ్లగడ్డ నియోజకవర్గం సంబంధించి ఉన్నాయని గ్రామాల్లోని నాయకులందరూ గ్రామ అభివృద్ధి చెందాలంటే ఏకగ్రీవాలు చేసుకుని ప్రభుత్వం నుండి వచ్చిన డబ్బుతో ఊరిని అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయంతోనే ఈ ఏకగ్రీవాలు జరగడం జరిగిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రజలు మరో మారు కూటమి ప్రభుత్వానికే పట్టం కట్టారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు, మేయర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీ లను భారీ సంఖ్యలో కైవసం చేసుకోవడం జరిగిందన్నారు.

**సర్పంచ్ ఎన్నికలలో కూడా ఇదే ప్రక్రియ కొనసాగుతుందన్నారు.**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగిన గ్రామాలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి తర్వాత ఆ హామీని తుంగలో తొక్కారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విమర్శించారు ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే 30 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో జడ్పిటిసి ఎంపీపీ సర్పంచ్ నిధులతో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అదే తమ కూటమి ప్రభుత్వంలో అలా జరగదని ఏకగ్రీవమైన అన్ని గ్రామాలకు ఏదైతే హామీ ఇచ్చామో అది తప్పక నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

**ప్రజలు కూడా ఈ విషయాన్ని గుర్తిస్తున్నారని తెలిపారు.**

ప్రజలు కూడా ఏ నాయకుడు ఉంటే తమ పనులు జరుగుతాయని ఆలోచన చేస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని గతంలో మంత్రి నారా లోకేష్ కలవడం జరిగిందని స్థలం చూపిస్తే కాలేజీ మంజూరు చేస్తారని తెలిపారు నేడు స్థలం చూపించడంతో ఐదు కోట్ల రూపాయలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం మంజూరు చేశారని ఆమె తెలిపారు ఆళ్లగడ్డ పట్టణంలో రెండు పార్కులను త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ వివరించారు,


# గ్రామాభివృద్ధే తమ లక్ష్యం సర్పంచ్ అభ్యర్థి పత్తి నాగేశ్వరమ్మ



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 22 నంది పత్రిక** మర్రిపల్లె గ్రామపంచాయతీ అభివృద్ధి తమ లక్ష్యం అని సర్పంచ్ అభ్యర్థి పత్తి నాగేశ్వరమ్మ అన్నారు మర్రి పల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పత్తి నాగేశ్వరమ్మ గ్రామ ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు ఆమె భర్త టిడిపి సీనియర్ నాయకులు పత్తి పాపిరెడ్డి తో కలిసి ముమ్మరంగా గ్రామంలోని ప్రతి వార్డులో ప్రచారంలో ముందున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో ఆశీస్సులతో పోటీ చేస్తున్నానని తాను సర్పంచ్ గా గెలిపిస్తే ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన రోడ్లు త్రాగునీరు డ్రైనేజీ వీధి దీపాలు పేదల పెన్షన్లు ఏ సమస్య వచ్చినా నేను ముందుండి తీరుస్తానని ప్రచారంలో ప్రజలకు హామీ ఇస్తున్నారు అందుకు ప్రజలందరూ తమ అమూల్యమైన గ్రామాభివృద్ధి కోసం పాటుపడే తనకు మంచం గుర్తుకు ఓటు వేయాలని సర్పంచ్ అభ్యర్థి పత్తి నాగేశ్వరమ్మ ఓటర్లను కోరుతున్నారు. ప్రచారంలో గ్రామ నాయకులు మహిళా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# సంచర్ల గ్రామ అభివృద్ధే లక్ష్యం.. అవకాశం ఇస్తే ప్రజలకు నిరంతరం సేవ చేస్తా: సర్పంచ్ అభ్యర్థి చిత్తా పద్మావతి

## చిత్తా రవి ప్రకాష్ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడి



**పోరుమామిళ్ల, నవంబర్ 22 ( నంది పత్రిక):**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం సంచర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి చిత్తా పద్మావతి గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, అందరికీ అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించడం, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం, వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు, మహిళలు, వృద్ధులు, యువత సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రతి వీధి అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.చిత్తా రవి ప్రకాష్ రెడ్డి సహకారంతో, వారి మార్గదర్శకత్వంలో గ్రామానికి మరింత మెరుగైన సేవలు అందిస్తానని ఆమె మాట ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తనకు ఒక అవకాశం ఇచ్చి, ఉంగరం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని చిత్తా పద్మావతి విజ్ఞప్తి చేశారు.

# నల్లగట్ల అభివృద్ధికి డబుల్ ఇంజన్ బలం

## ఎంపీపీ, సర్పంచ్ కలిస్తే గ్రామ ప్రగతికి బాటలు--



**ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 22 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం నుంచి శీలం గీతావాణి ఎంపీపీగా ఎన్నిక కావడం గ్రామ అభివృద్ధికి గొప్ప అవకాశంగా గ్రామస్థులు భావిస్తున్నారు. గ్రామం నుంచి నాయకురాలు మండల స్థాయిలో బాధ్యతలు చేపట్టడంతో నల్లగట్ల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.ఎంపీపీ శీలం గీతావాణి, గ్రామ సర్పంచ్ ఒక్కటై సమన్వయంతో ముందుకు సాగితే గ్రామ అభివృద్ధి పనులకు మరింత వేగం వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మండల స్థాయి నాయకత్వం, గ్రామస్థాయి పాలన కలిసి పనిచేస్తే గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వ సహకారం, నిధులు సమకూర్చుకోవడంలో అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని ఆశిస్తున్నారు.గ్రామంలో రహదారులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీపీ, సర్పంచ్ ఒకే లక్ష్యంతో పనిచేస్తే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి నల్లగట్లను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని అంటున్నారు.

**ఎంపీపీ అండ.. సర్పంచ్ నాయకత్వం** గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ఎంపీపీ శీలం గీతావాణి అండతో సర్పంచ్ అభ్యర్థి బద్రి వెంకట లక్ష్మమ్మ ముందుకు సాగితే నల్లగట్లకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనుల అమలులో ఇద్దరి సమన్వయం కీలకంగా మారనుందని పేర్కొంటున్నారు. నల్లగట్ల భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ అభ్యర్థి బద్రి వెంకట లక్ష్మమ్మకు అధిక మెజారిటీతో మద్దతు తెలిపి గెలిపించాలని గ్రామ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల స్థాయి అండ, గ్రామ స్థాయి నాయకత్వం కలిస్తే నల్లగట్ల అభివృద్ధికి కొత్త దిశ చూపుతుందనే ఆకాంక్ష గ్రామంలో వ్యక్తమవుతోంది.

# నేడు (23న) మున్సిపల్ పాలకవర్గాల ప్రమాణస్వీకారం, ఎన్నికలు

## కడప నగర పాలక సంస్థలో మేయర్, కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం.. ఉప మేయర్ ఎన్నిక 8 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ప్రమాణస్వీకారం, వైస్ చైర్మన్ల ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

**కడప బ్యూరో చీఫ్, నవంబర్ 22 నంది పత్రిక**

వైఎస్ఆర్ కడప జిల్లాలోని కడప నగర పాలక సంస్థతో పాటు 8 మున్సిపాలిటీల్లో నేడు (నవంబర్ 23) నూతన పాలకవర్గాల ప్రమాణస్వీకారం, ఎన్నికల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**కడప నగర పాలక సంస్థలో మేయర్, కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం**

కడప నగర పాలక సంస్థలో నేడు నూతనంగా ఎన్నికైన మేయర్ ప్రమాణస్వీకారంతో పాటు అన్ని డివిజన్ల కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం నిర్వహించనున్నారు. అనంతరం ఉప మేయర్ ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మేయర్, కార్పొరేటర్లు, పదవీరీత్యా సభ్యులు, ఇతర ప్రముఖులకు ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార వేదిక, సమావేశ మందిరం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలతో పాటు సభ్యులు, ఆహ్వానితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగిన భద్రతా చర్యలు కూడా చేపట్టారు.

**8 మున్సిపాలిటీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక**

జిల్లాలోని రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, మైదుకూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కమలాపురం మున్సిపాలిటీల్లో 23న సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ముందుగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ల ప్రమాణస్వీకారం, అనంతరం వైస్ చైర్మన్ల ఎన్నిక చేపట్టనున్నారు.ఆయా మున్సిపాలిటీల్లో సంబంధిత మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చైర్మన్లు, వార్డు సభ్యులు, పదవీరీత్యా సభ్యులకు ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ సదుపాయాలు, ప్రమాణస్వీకార వేదిక, సమావేశ మందిరాలు, సంబంధిత అన్ని సదుపాయాలు కల్పించారు. కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు భద్రతతో పాటు ఇతర శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టారు. నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో జరిగే అన్ని కార్యక్రమాలు నిర్దిష్ట సమయానికి ప్రారంభమయ్యేలా, ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

# యర్రగుంట్ల 7వ వార్డులో దూసుకుపోతున్న ప్రచారం బీసీ నాయకుడు అందరికీ కలుపుకుపోయే శీలం లక్ష్మి ప్రసాద్

**సిరివెళ్ల (నంది పత్రిక)**గౌను గుర్తుకు ప్రతి ఒక్కరు ఓటు వేసి వేయించి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరుచున్నాడులి గతంలో ఎర్రగుంట్ల గ్రామం మేజర్ పంచాయతీ కి సర్పంచ్ గా పోటీ చేసిన వ్యక్తి శీలం లక్ష్మి ప్రసాద్ ఇతను దాదాపు ఎర్రగుంట్ల లో మొత్తం అన్ని వర్గాల నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు అందరికీ పరిచయం ఉన్న వ్యక్తి అందరికీ కలుపుకొని పోయే వ్యక్తి ఇతను బీసీ వర్గానికి ఏ విధమైన సహాయం చేయడానికి ముందు ఉండి నిలబడతాడు.

**వార్డు అభివృద్ధే లక్ష్యం :** “7వ వార్డు ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించడమే నా లక్ష్యం. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, పేదల పెన్షన్లు – ఏ సమస్య వచ్చినా నేనే ముందుండి తీరుస్తాను“ అని శీలం లక్ష్మి ప్రసాద్ గారు అంటున్నారు.గతంలో సర్పంచ్ గా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయిన కానీ మాట ఇచ్చి మాటమీద నిలబెట్టుకున్న డు ఏడవ వార్డ్ లో బీసీ వర్గానికి ఎన్నో పనులకు ముందుండి నడిపించిన వ్యక్తి శీలం లక్ష్మి ప్రసాద్ **అభ్యర్థి : శీలం లక్ష్మీప్రసాద్ వార్డు : ఎర్రగుంట్ల 7వ వార్డు గుర్తు : గౌను గుర్తు**

# వెలుగోడులో రెహానా పర్వీన్ ఎన్నికల ప్రచారం



**వెలుగోడు, నవంబర్ 22 (నంది పత్రిక):**వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బలపరిచిన వైఎస్ఆర్సీపీ సర్పంచ్ అభ్యర్థి రెహానా పర్వీన్ ఆదివారం పట్టణంలోని మారెమ్మ వీధి, తెలుగు పేట, చాకలిపేట, దాసరి వీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.స్థానిక నాయకులు మరియు పార్టీ ప్రతినిధులు అందించిన వివరాల ప్రకారం, ఈ ప్రచార కార్యక్రమంలో అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు. ప్రజలు తమ అభిప్రాయాలను అభ్యర్థితో పంచుకున్నారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో పట్టణంలో ఎన్నికల ప్రచారం వేగవంతమైంది.

# రేపు మహానందిలో కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం...



**మహానంది, నవంబర్ 23 (నంది పత్రిక):-** ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం 24న కోటి దీపోత్సవం మరియు జ్వాలా తోరణం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని వెల్లడించారు. ఆలయ ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళిరెడ్డిల ఆధ్వర్యంలో ఈ మహా వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు.మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు ఆలయ రాజగోపురం ఎదురుగా వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జ్వాలా తోరణం వెలిగిస్తారని పేర్కొన్నారు.అనంతరం వేలాది మంది భక్తులు, దంపతుల సమక్షంలో కోటి దీపోత్సవ కార్యక్రమం కన్నులపండువగా ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యంగా ఈ మహా దీపోత్సవంలో నేరుగా కూర్చొని పూజలు చేసుకునేందుకు 1,000 మంది దంపతులకు ఆలయ కమిటీ ప్రత్యేక అవకాశం కల్పించిందని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొని శ్రీ మహానందీశ్వర స్వామివారి మరియు కార్తీక దామోదరుని దివ్యానుగ్రహం పొందాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు.



## వ్యవసాయ, ఉద్యానవన పంట నష్టం నమోదు కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** ఇటీవల సంభవించిన ఆర్నాబ్, మురుసు తుఫానుల నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని నమోదు చేసేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆదివారం ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాల నమోదు ప్రక్రియను, రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటిపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం అంచనాలో అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా సమగ్ర వివరాలు నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.



## పంట నష్టం అంచనాకు వ్యవసాయ సిబ్బంది రాకపోతే కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలి

### ఇన్‌చార్జి కలెక్టర్ కే.ఆర్. కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** ఇటీవల సంభవించిన ఆర్నాబ్, మురుసు తుఫానుల కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ కే.ఆర్. కల్పశ్రీ తెలిపారు. పంట నష్టం అంచనా కోసం వ్యవసాయ సిబ్బంది తమ గ్రామాలకు రాకపోయినట్లయితే రైతులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08816299181 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## పశ్చిమగోదావరి జిల్లాలో కేంద్ర సమీక్షా బృందం ( సి ఆర్ ఎం) పర్యటన



**భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర సమీక్షా బృందం ఈ నెల 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనుందని జిల్లా వైద్యాధికారి డా ఏం రవిబాబు తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా బృందం సభ్యులు జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు , సామాజిక ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం సందర్శిస్తారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరు, వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాలు మరియు క్షేత్రస్థాయి అమలు తీరును బృందం సమగ్రంగా సమీక్షించనుంది.

పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్న బృందం సభ్యుల వివరాలు:

1. మోనా గుప్తా
2. డాక్టర్ స్మితా శ్రీవాస్తవ
3. మౌతుసి దేబ్‌నాథ్
4. డాక్టర్ బాబీ పాల్
5. డాక్టర్ పి.జె. శ్రీనివాస్
6. కె.ఆర్. మనీష్
7. డాక్టర్ యు.ఆర్. శేఖర్ నంబూరి
8. డాక్టర్ నరసింహ నాయక్, జాయింట్ డైరెక్టర్,
9. డాక్టర్ సి.హెచ్. శిరీష, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ హెచ్ ఎం
10. డాక్టర్ గీతా పద్మజ, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ హెచ్ ఎం
11. డాక్టర్ నాగలక్ష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్ హెచ్ ఎం
12. డాక్టర్ ప్రసన్న కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ హెచ్ ఎం
13. వేణు కుమార్, కన్సల్టెంట్
14. వినోద్ కుమార్, కన్సల్టెంట్
15. సుశాంక్ నాయక్, సి ఆర్ ఎం

ఈ పర్యటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు మరియు ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి రికార్డులు, నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశించారు.



## మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో రెండో రోజు 2,044 నామినేషన్లు

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

### రెండు రోజుల్లో మొత్తం 3,629 నామినేషన్ల దాఖలు



**కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 22: నంది పత్రిక** వైఎస్ఆర్ కడప జిల్లాలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆదివారం రెండో రోజు మొత్తం 2,044 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. వీటిలో సర్పంచ్ స్థానాలకు 440 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,604 నామినేషన్లు నమోదైనట్లు వెల్లడించారు. మూడో విడత ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని 13 మండలాల్లో శనివారం మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 465, వార్డు సభ్యుల స్థానాలకు 1,120 నామినేషన్లు దాఖలయ్యాయని.. ఆదివారం రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 440, వార్డు సభ్యుల స్థానాలకు 1,604 నామినేషన్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. దీంతో రెండు రోజుల్లో కలిపి సర్పంచ్ స్థానాలకు 905, వార్డు సభ్యుల స్థానాలకు 2,724 నామినేషన్లు, మొత్తం 3,629 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు.మండలాల వారీగా పరిశీలిస్తే జమ్మలమడుగు మండలంలో సర్పంచ్ స్థానాలకు 25, వార్డు సభ్యులకు 68 నామినేషన్లు; మైలవరంలో 41, 133; చాపాడులో 34, 159; దువ్వూరులో 34, 140; ముద్దనూరులో 43, 134; రాజుపాలెంలో 34, 138; ప్రొద్దుటూరులో 37, 186; పెద్దముడియంలో 33, 134; కొండాపురంలో 24, 94; ఎర్రగుంట్లలో 32, 91; మైదుకూరులో 28, 93; ఖాజీపేటలో 46, 135; బి.మఠంలో 29, 99 నామినేషన్లు రెండో రోజు దాఖలైనట్లు కలెక్టర్ వివరించారు. 23వ తేదీన మూడవ రోజు నామినేషన్ల ప్రక్రియ కూడా సజావుగా జరిగేలా అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టినట్లు, అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లను సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# కత్తివీధిలో... కత్తెర గుర్తు

### 45వ వార్డులో ఇండిపెండెంట్ హవా!

### ప్రచారంలో దూకుడు దార్ల దివ్య జ్యోతి పేరు

### మారుమోగుతున్న వైనం!



**శ్రీకాకుళం బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** 45వ వార్డు ఎన్నికల వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన దార్ల దివ్యజ్యోతి ప్రచారం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రచారంలో ఆమె చూపిస్తున్న దూకుడు, ప్రజలను నేరుగా కలుస్తూ సాగిస్తున్న పర్యటనలు, ప్రతి వీధిలోనూ కనిపిస్తున్న చురుకుదనం ఎన్నికల సందడిని మరింత పెంచుతున్నాయి.ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలు వింటూ, తన అభ్యర్థిత్వాన్ని బలంగా వినిపిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రచార కార్యక్రమాల్లో కనిపిస్తున్న ఉత్సాహం, మద్దతుదారుల సందడి, వార్డులో ఆమె అభ్యర్థిత్వంపై సాగుతున్న చర్చలు 45వ వార్డు ఎన్నికలను మరింత ఆసక్తికరంగా మారుస్తున్నాయి.అనుకున్నది అనుకున్నట్టు జరిగితే దార్ల దివ్యజ్యోతి భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే అంచనాలు ఆమె మద్దతుదారుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు స్వతంత్ర అభ్యర్థిగా ఆమె ఇస్తున్న పోటీ ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.పార్టీ బలం కంటే ప్రజాబలం ముఖ్యం‌ఉ గుర్తు కంటే అభ్యర్థిపై నమ్మకమే కీలకం! 45వ వార్డులో ప్రచార జోరు చూస్తుంటే ఈసారి ఎన్నికల పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది.



# పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

### - ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి,

### - వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య,

### - హనుమకొండ లోని ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,

పోలియో మహమ్మారిని దేశం నుంచి నిర్మూలించినప్పటికీ, భవిష్యత్తులో ఆ వ్యాధి మళ్లీ ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మూడేళ్ల కుమార్తెకు ఎంపీ స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఇతర చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారిని ఎత్తుకొని పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. పోలియో మైలిటిస్ వ్యాధి చిన్నారులను జీవితాంతం అంగవైకల్యానికి గురిచేసే ప్రమాదకరమైన వ్యాధి అని పేర్కొన్నారు. భారతదేశం 2014లోనే పోలియో రహిత దేశంగా ప్రకటించబడినప్పటికీ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమాన్ని కొనసాగిస్తోందన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినా, వేయకపోయినా ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి ఈ కార్యక్రమంలో ఉచితంగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ ప్రయాణికుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.వరంగల్‌ను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో మౌలిక సదుపాయాలను విస్తరిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా 24 అంతస్తులతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలో అందుబాటులోకి రానుందని వెల్లడించారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.హనుమకొండ జిల్లాలో సిజేరియన్ ప్రసవాల సంఖ్యపై ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుంబ సభ్యుల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. వైద్యపరంగా అత్యవసరమైన పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ఆపరేషన్లు చేయాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైద్యులు, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ‌లి చిన్నారుల ఆరోగ్య భద్రతకు పోలియో చుక్కలు ఎంతో కీలకం అని అన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసిన ఐదు జిల్లాల్లో హనుమకొండ జిల్లా కూడా ఉండటం సంతోషకరమని తెలిపారు. జిల్లాలో సుమారు 84 వేల మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం 497 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ‌లి పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోండి

### పదవులు కాదు.. ప్రజాసేవే లక్ష్యం కావాలి

### ప్రజా తీర్పుకు బాధ్యతతో సమాధానమివ్వాలి


### అభివృద్ధే అజెండాగా ముందుకు సాగండి

### నూతన ప్రజాప్రతినిధులకు ఎంపీ పుట్టా దిశానిర్దేశం



**ఏలూరు బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక**ప్రజలు నమ్మకంతో అప్పగించిన పదవులను ప్రజాసేవకు వేదికలుగా మలుచుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు. ఏలూరు నగరానికి చెందిన నూతన కార్పొరేటర్లు, వివిధ ప్రాంతాల జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆదివారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టార్ మహేష్ మాట్లాడుతూ : ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ,స్థానిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, పదవులు ప్రజలకు సేవ చేసే అవకాశాలని, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. నూతన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఏలూరులోని ఎంపీ కార్యాలయం సందడిగా మారింది. టీడీపీతో పాటు జనసేన, బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎంపీని కలవడం ప్రత్యేకత సంతరించుకుంది.

## మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పరిశీలించిన ఇన్చార్జ్ జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 22 నంది పత్రిక** కలెక్టరేట్లోని తన చాంబర్లో ఆదివారం మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు చేపట్టిన ర్యాండమైజేషన్ ప్రక్రియను ఇన్చార్జ్ జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పరిశీలించారు. ఎన్నికల విధులకు సిబ్బందిని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం కేటాయించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## భారత్, పాక్ మ్యాచ్‌లో టెన్షన్.. హర్షిత్ రాణా, మాజీ సదాకత్ మధ్య మాటల యుద్ధం..

భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ సమరం అంటేనే మైదానంలో భావోద్వేగాలు, తీవ్ర పోటీ వాతావరణం నెలకొంటుంది. ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో భాగంగా జరిగిన ఇండియా 'ఎ', పాకిస్థాన్ 'ఎ' మ్యాచ్‌లో కూడా సరిగ్గా ఇదే తరహా ఉద్రిక్తత కనిపించింది. భారత పేస్ బౌలర్ హర్షిత్ రాణా, పాకిస్థాన్ బ్యాటర్ మాజ్ సదాకత్ మధ్య మైదానంలో చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదం మ్యాచ్ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. మ్యాచ్‌లో భాగంగా ఏడో ఓవర్ వేస్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. హర్షిత్ రాణా వేసిన స్లోయర్ డెలివరీని ఆడటంలో పాక్ బ్యాటర్ మాజ్ సదాకత్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. సరైన షాట్ ఆడలేకపోయిన సదాకత్ వైపు నడుచుకుంటూ వెళ్లిన హర్షిత్ రాణా, అతనిపై కొన్ని వ్యాఖ్యలు చేశాడు. ఆ తర్వాతి బంతిని రాణా షార్ట్ పిచ్‌గా సంధించగా, సదాకత్ ర్యాంప్ షాట్ ఆడేందుకు విఫలయత్నం



చేశాడు. బంతి కనెక్ట్ కాకపోవడంతో రాణా మరింత దూకుడుగా బ్యాటర్‌తో మాటల యుద్ధానికి దిగాడు. ఆ తర్వాత నాలుగో బంతిని సదాకత్ బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీశాడు. అయితే బ్యాటర్లు ఎండ్స్ మారుతున్న సమయంలో కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం కొనసాగింది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఎలాంటి మాటలు దొర్లాయనే వివరాలు కచ్చితంగా తెలియనప్పటికీ, మైదానంలో వారి ముఖ కవళికలు, హావభావాలు ఉద్రిక్తతను స్పష్టంగా ప్రతిబింబించాయి. ఆ ఓవర్‌లోనే తర్వాతి బంతుల్లో మరో పాక్ బ్యాటర్ షమీల్ హుస్సేన్‌కు బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా రాణా అదే దూకుడును ప్రదర్శించాడు.

హర్షిత్ రాణా మొదటి నుంచీ దూకుడైన బౌలింగ్ శైలికి, ప్రత్యర్థులను కవ్వించే స్వభావానికి పేరుగాంచాడు. హై-ప్రెజర్ వాతావరణంలో సాగే భారత్-పాక్ పోరులో రాణా ప్రదర్శించిన ఈ తీవ్రత మ్యాచ్‌లోని పోటీతత్వాన్ని మరింత పెంచింది. ఈ తరహా ఘర్షణలు దాయాదుల పోరుకు సహజమైన రసవత్తరతను తెచ్చిపెట్టినప్పటికీ, మాటల కంటే మైదానంలో ప్రదర్శించే నైపుణ్యం, తీసే వికెట్లే అసలైన ఫలితాన్ని నిర్దేశిస్తాయి.

# బిజినెస్

## భారీగా పతనమైన బిట్ కాయిన్ విలువ రెండేళ్లలో ఇదే తొలిసారి




బిజినెస్ డిస్క్: ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ కరెన్సీ అయిన బిట్ కాయిన్ విలువ భారీగా తగ్గింది. రెండేళ్ల తరువాత తొలిసారిగా 56 వేల డాలర్లకు కుప్పకూలింది.క్రిప్టో కరెన్సీ అయిన బిట్ కాయిన్ విలువ అంతర్జాతీయ స్థాయిలో భారీగా తగ్గింది. 2024 సెప్టెంబర్‌లో తొలిసారిగా భారీ స్థాయిలో 55,533 డాలర్లకు తగ్గిన దీని విలువ మళ్లీ రెండేళ్ల తరువాత.. ప్రస్తుతం అదే స్థాయిలో తగ్గిపోయింది. 2024 సెప్టెంబర్ తరువాత దీని విలువ నెమ్మదిగా పురోగమిస్తూ 2025 అక్టోబర్ నాటికి గరిష్ఠంగా 1,26,000 డాలర్లకు చేరుకోగా.. ప్రస్తుతం దీని విలువ సగానికి సగానికి సగం పడిపోయింది. ఇంత భారీ స్థాయిలో బిట్ కాయిన్ విలువ తగ్గిపోవడం రెండేళ్లలో ఇదే తొలిసారి. ఏఐ స్టాక్స్‌పై ఆందోళనలు ఉన్న నేపథ్యంలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న భయంతో క్రిప్టో ఈటీఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణల కారణంగానే.. బిట్ కాయిన్ కరెన్సీ విలువ సగానికి సగం పడిపోయిందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## గృహరుణం కేసులో ఎస్‌బీఐకి షాక్.. రోజుకు రూ.5,000 చొప్పున 7 ఏళ్లకు జరిమానా!




గృహ రుణం పూర్తిగా చెల్లించినా ఏళ్ల తరబడి అసలు ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వకుండా ఓ వృద్ధుడిని ఇబ్బందులకు గురిచేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బ్యాంకు సేవా లోపాన్ని తీవ్రంగా పరిగణించిన వినియో గదారుల కమిషన్, బాధితుడికి రోజుకు రూ.5000 చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ జరిమానా మొత్తం రూ.1.35 కోట్లకు పైగా చేరనుండటం బ్యాంకింగ్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. 45 రోజుల్లోగా ఈ ఆదేశాలు అమలు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.కేసు వివరాలు ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన 70 ఏళ్ల గుల్వీర్ సింగ్ చౌహాన్, 1997లో స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గృహ రుణం తీసుకుని, తన ఇంటి అసలు సేల్ డీడ్‌ను బ్యాంకులో తనఖా పెట్టారు. ఆయన తన రుణ బకాయిలన్నింటినీ 2019 మే 13 నాటికి పూర్తిగా చెల్లించారు. దీనికి సంబంధించి 2020 ఫిబ్రవరిలో బ్యాంకు నుంచి నో డ్యూ సర్టిఫికేట్ కూడా పొందారు. అయితే, అసలు ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వాలని కోరగా, అవి కనిపించడం లేదంటూ బ్యాంకు అధికారులు ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అసలు పత్రాలు చేతికి రాకపోవడంతో ఆస్తిపై యాజమాన్య హక్కులు నిరూపించుకోవడానికి, ఇతర అవసరాలకు ఆయన తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడేళ్లకు పైగా ఎదురుచూసి విసిగిపోయిన గుల్వీర్ సింగ్, 2023 జూన్‌లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కమిషన్, ఎస్‌బీఐ వైఖరి తీవ్రమైన సేవా లోపమని నిర్ధారించింది. కమిషన్ సంచలన తీర్పు రుణం చెల్లించిన 2019 మే 13వ తేదీ నుంచి అసలు పత్రాలను బాధితుడికి తిరిగి అప్పగించేంత వరకు ప్రతి రోజూ రూ.5000 చొప్పున పరిహారం చెల్లించాలని ఎస్‌బీఐని ఆదేశిం చింది. దీని ప్రకారం, సుమారు ఏడున్నర సంవత్స రాల కాలానికి జరిమానా రూ.1.35 కోట్లకు పైగా ఉంటుంది. దీంతో పాటు న్యాయపరమైన ఖర్చుల కింద మరో రూ.10,000 చెల్లించాలని తీర్పు ఇచ్చిం ది. 45 రోజుల్లోగా ఈ ఆదేశాలను అమలు చేయ కపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

## అత్యవసర నిధి ఉందా?




జీవితం మనం ఊహించిన మార్గంలో అరుదుగా సాగుతుంది. ఎన్నో ఎత్తుపల్లాలు ఎదురవుతుండటం సహజం. ఒకరోజు చాలా సజావుగా గడిచిపోతుంది. మర్నాడు ఎలా ఉంటుందో ఊహించలేము. ఏదైనా అనుకోని, అత్యవసర పరిస్థితి ఏర్పడవచ్చు. వైద్యపరమైన అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగం కోల్పోవడం లేదా ఇళ్లు, వాహనానికి మరమ్మతు చేయాల్సిన పరిస్థితి ఎదురుకావొచ్చు. అయితే ఇలాంటి వాటికయ్యే ఖర్చులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధపడి ఉండకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ తరహా అత్యవసర ఖర్చుల కోసం మీరు ఒక అత్యవసర నిధిని గానీ ఏర్పాటు చేసుకుని ఉంటే మీరు అప్పుల కోసం ఇతరుల ముందు చేయి చాచాల్సిన పరిస్థితి గానీ లేదా మీ దీర్ఘకాలిక పొదుపును వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడకుండా ఉంటుంది.జీవన వ్యయాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఆర్థిక పరిస్థితులు మారుతున్నాయి. ఆర్థిక బాధ్యతలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి తరుణంలో అత్యవసర నిధికి మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. అయితే అత్యవసర నిధి అంటే ఏంటి? దీన్ని ఎలా ఏర్పాటు చేసుకోవాలి? దీనివల్ల ప్రయోజనం ఎంత? అన్న విషయాల గురించి చూద్దాం.. భరోసా కోసం..ఊహించని, అత్యవసర వ్యయాల కోసం మీరు సంపాదించే మొత్తంలో కొంత భాగాన్ని పక్కకు పెడుతూ డబ్బును పోగోసు కోవడాన్ని అత్యవసర నిధిగా చెప్పవచ్చు. దీనివల్ల మీకు చాలా భరోసా ఏర్పడు తుంది. మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పడిన సందర్భంలో లేదా ఉద్యోగం పోయినప్పుడు లేదా ఆదాయంలో తాత్కాలికంగా అవరోధాలు ఏర్పడినప్పుడు, వాహనానికి అత్యవసరంగా రిపేర్లు చేయాల్సి వచ్చినప్పుడు, అనుకోకుండా ప్రయాణించాల్సి వచ్చినప్పుడు ఇది మీకు ఆర్థిక దన్నును ఇస్తుంది. ఈ నిధి ఉన్నట్టయితే మీరు ఊహించని ఖర్చులు ఎదురైనా అంత ఆందోళన చెందాల్సిన అవసరం ఏర్పడదు.

## శాండ్‌పేపర్ వివాదం.. క్రోనే మ్యాచ్ ఫిక్సింగ్ కంటే పెద్ద స్కాండల్: బాయ్‌కాట్ సంచలన వ్యాఖ్యలు

ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం.. దక్షిణాఫ్రికా క్రికెట్‌లో సంచలనం సృష్టించిన హ్యాన్సీ క్రోనే మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం కంటే పెద్దదని ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ సర్ జెఫ్రీ బాయ్‌కాట్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను చూసిన క్రికెట్ కుంభకోణాల్లో ఇదే అతిపెద్దదని ఆయన అభిప్రాయపడ్డారు ఎనిమిదేళ్ల క్రితం దక్షిణాఫ్రికా పర్యటనలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన విషయం తెలిసిందే. అయితే, ఈ విషయం జట్టు మొత్తానికి తెలుసని ఇటీవల ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబ్ర'లో పేర్కొనడంతో ఈ వివాదం మళ్లీ రాజుకుంది. డేవిడ్ వార్నర్ కూడా ఖవాజా వాదనకు మద్దతు పలికాడు. మరోవైపు, ఈ కుట్ర గురించి తనకు తెలియదని కెప్టెన్ పాట్ కమిన్స్ చెప్పగా, నిషేధానికి గురైన కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ మాత్రం ఖవాజా వ్యాఖ్యలను సమర్థించాడు. ఈ నేపథ్యంలో 'ది టెలిగ్రాఫ్' పత్రికకు రాసిన తన కాలమ్‌లో బాయ్‌కాట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "హ్యాన్సీ క్రోనే కుంభకోణంలో కేవలం ఇద్దరు ముగ్గురు ఆటగాళ్ల ప్రమేయం ఉంది. కానీ శాండ్‌పేపర్ వివాదంలో ఆస్ట్రేలియా జట్టు, కోచింగ్ సిబ్బంది అందరూ



కలిసికట్టుగా మోసం చేయడానికి కుట్ర పన్నారు. ముగ్గురు ఆటగాళ్లపై నెపం నెట్టి మిగతా వాళ్లు తప్పించుకున్నారు. ఇది నమ్మశక్యం కాని విషయం" అని బాయ్‌కాట్ పేర్కొన్నారు. అలాగే, అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై బాయ్‌కాట్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "వార్నర్, స్మిత్‌లకు విధించిన శిక్ష చాలా తక్కువ. వారిపై ఐదేళ్ల నిషేధం విధించాల్సింది. కెప్టెన్‌గా వార్నర్ ఈ ఆలోచన చేసినప్పుడే స్మిత్ అడ్డుకోవాల్సింది. కానీ 'నాకు దీని గురించి తెలియాల్సిన అవసరం లేదు' అని చెబుతూనే, మోసం ద్వారా వచ్చే ప్రయోజనాలను స్వీకరించడం దిగ్భ్రాంతికి గురిచేసింది. కెప్టెన్‌గా తన బాధ్యతను విస్మరించిన స్మిత్‌ను చరిత్ర క్షమించదు" అని ఆయన ఘాటుగా విశ్లేషించారు.

# స్పోర్ట్స్

## రాజకీయాల్లోకి టీమిండియా స్పిన్నర్.. బీజేపీలో చేరిన చాహల్!



భారత క్రికెట్ జట్టు స్టార్ లెగ్ స్పిన్నర్, 2024 టీ20 ప్రపంచకప్ విజేత జట్టు సభ్యుడైన యుజ్వేంద్ర చాహల్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. చాహల్ శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరాడు. ఈ సందర్భంగా పార్టీ అధిష్ఠానం అతడికి కీలక బాధ్యతలు అప్పగించింది. బీజేపీ ఓబీసీ మోర్చా ఢిల్లీ విభాగం కార్యవర్గంలో చాహల్‌ను 'ప్రత్యేక ఆహ్వానితుడు'గా నియమించింది.బీజేపీలో చేరిన అనంతరం చాహల్ సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు బీజేపీ అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపాడు. "బీజేపీ కుటుంబంలో నాకు చోటు, గౌరవం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అమర్‌పాల్ మౌర్యకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చాహల్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నాడు.36 ఏళ్ల చాహల్ 2016 నుంచి 2024 వరకు భారత్ తరఫున 72 వన్డేలు, 80 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 121 వికెట్లు, టీ20ల్లో 96 వికెట్లు పడగొట్టాడు. టీ20 క్రికెట్‌లో 400 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడాడు. 2025 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ జట్టు చాహల్‌ను రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది.

## వెల్లింగ్టన్‌లో పంత్ సెంచరీకి గవాస్కర్ స్టాండింగ్ ఒవేషన్

టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరోసారి తనదైన శైలిలో చెలరేగిపోయాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న టెస్టు మ్యాచ్ నాలుగో రోజు పంత్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇది అతనికి టెస్టుల్లో తొమ్మిదో శతకం. ఈ సెంచరీతో పంత్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నింగ్స్‌లో భాగంగా గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్ మీదుగా అద్భుతమైన సిక్సర్ బాది పంత్ తన సెంచరీని పూర్తి చేసుకు న్నాడు. ఆ సమయంలో కామెంటరీ బాక్సులో ఉన్న భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్, పంత్ షాట్‌కు ముగ్ధుడై తన సీటులో నుంచి లేచి నిలబడి చప్పట్లతో అభినందించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ పంచుకుంది. అరుదైన రికార్డులు బద్దలు! ఈ సెంచరీతో టెస్టుల్లో అత్యధిక శతకాలు సాధించిన వికెట్ కీపర్ల జాబితాలో పంత్ మూడో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్‌కు చెందిన లెస్ అమెస్ (8 సెంచరీలు)ను అతను అధిగమించాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్ (17), జింబాబ్వే ఆటగాడు ఆండీ ఫ్లవర్ (12) మాత్రమే పంత్ కన్నా ముందున్నారు. అంతేకాకుండా 'సెనా' దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్ల ండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా నాలుగింటి లోనూ



టెస్టు సెంచరీ చేసిన తొలి ఆసియా వికెట్ కీపర్‌గా పంత్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో వికెట్ కీపర్ కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో పంత్ చేసిన శతకం, న్యూజిలాండ్‌పై భారత్ పట్టును మరింత బిగించేందుకు దోహదపడింది.

## కొణిదెల సురేఖ వద్ద రూ.5 వేలు అప్పు తీసుకున్న బన్నీ వాసు.. ఇప్పటికీ తీర్చలేదట!

ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బన్నీ వాసు తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక ఆసక్తికరమైన సంఘటనను తాజాగా పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖ చేసిన ఒక చిన్న ఆర్థిక సాయం తన సినీ ప్రస్థానానికి ఎలా పునాదిగా మారిందో ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ఆమె వద్ద తీసుకున్న చిన్న మొత్తమే తన ఎదుగుదలకు కారణమైందని, ప్రస్తుతం తాను కోట్ల రూపాయల ఆస్తులను సమకూర్చుకున్నప్పటికీ ఆమె రుణం తీర్చుకోలేనిదని ఆయన పేర్కొన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించిన 'ఆర్య' సినిమా సమయంలో బన్నీ వాసు ఆ ప్రాజెక్ట్‌కు కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ఆ సమయంలో సినిమాపై ఉన్న నమ్మకంతో పశ్చిమ గోదావరి జిల్లా డిస్ట్రిబ్యూషన్ హక్కులను దక్కించుకోవాలని ఆయన భావించారు. అయితే ఆ హక్కులు సొంతం చేసుకోవడానికి ఆయన వద్ద రూ.45 వేలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన మొత్తం కోసం ఆయన మెగా కుటుంబాన్ని ఆశ్రయించగా, సురేఖ స్వయంగా స్పందించి ఆయనకు రూ.5 వేలు అప్పుగా ఇచ్చి ప్రోత్సహించారు.సురేఖమ్మ అందించిన ఆ ఆర్థిక సాయంతో డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి అడుగుపెట్టిన బన్నీ వాసు, ఆ తర్వాత నిర్మాతగా మారి టాలీవుడ్‌లో అంచెలంచెలుగా ఎదిగారు. ప్రస్తుతం విజయవంతమైన నిర్మాతగా కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నప్పటికీ, నాటి రోజులను ఆయన ఎన్నడూ మర్చిపోలేదు. అయితే అప్పట్లో సురేఖమ్మ ఇచ్చిన ఆ రూ.5 వేల అప్పును తాను ఇప్పటికీ తిరిగి ఇవ్వలేదని ఆయన నవ్వుతూ సరదాగా వెల్లడించారు. ఆ చిన్న సాయమే తన జీవితాన్ని మలుపు తిప్పిందని ఆయన కృతజ్ఞతతో వివరించారు.

దివంగత ప్రముఖ హాస్య నటుడు అల్లు రామలింగయ్య కుమార్తెగా, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సోదరిగా, మెగాస్టార్ చిరంజీవి అర్ధాంగిగా సురేఖ చిత్ర పరిశ్రమలో అందరి అభిమానాన్ని చూరగొన్నారు. కేవలం చిరంజీవి భార్యగానే కాకుండా, ఇండస్ట్రీలోని ఎందరికో ఆమె ఆపన్నహస్తం అందించారని పేరుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సినిమాల్లోకి రాకముందు తన వ్యక్తిగత ఖర్చుల కోసం ఆమె వద్దే డబ్బులు అడిగి తీసుకునేవారని చెబుతుంటారు. సురేఖ తన జీవితంలోకి వచ్చాకే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అన్నింటా అదృష్టం కలిసివచ్చిందని చిరంజీవి కూడా పలు సందర్భాల్లో బహిరంగంగానే ప్రశంసించారు.



## ఈ ఫొటోలో నాగార్జున పక్కన ఉన్న భామను గుర్తుపట్టారా?

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఓ ఫొటో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. అందులో టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పక్కన సంప్రదాయ దుస్తుల్లో ఓ అందాల భామ నవ్వులు చిందిస్తూ కనిపించారు. దీంతో అసలు నాగార్జున పక్కన ఉన్న ఆ ముద్దుగుమ్మ ఎవరు? ఎక్కడో చూసినట్టు ఉందే అని నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు. తీరా చూస్తే ఆమె మరెవరో కాదు.. 'మన్మథుడు' సినిమాలో నాగార్జున సరసన 'మహి' పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్న అందాల తార అన్షు (అన్షు అంబానీ). దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వీరిద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో ఈ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. హైదరాబాద్‌లో తమ సన్నిహితుడు కరణ్ వివాహానికి సంబంధించిన హల్దీ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ఈ ప్రైవేట్ వేడుకకు నాగార్జునతో పాటు ఆయన భార్య అమల కూడా హాజరయ్యారు. ఇదే ఈవెంట్‌కు నటి అన్షు కూడా విచ్చేశారు. ఈ సందర్భంగా నాగార్జున, అన్షు చాలా ఆప్యాయంగా పలకరించుకుని, ఫొటోలు దిగారు. ఈ మధుర క్షణాలకు సంబంధించిన చిత్రాలను అన్షు స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ వేడుకలో నాగార్జున, అన్షు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాగార్జున లైట్ ఎంబ్రాయిడరీతో కూడిన తెల్లటి కుర్తా పైజామా, కూలింగ్ గ్లాసెస్, గడ్డంతో ఎప్పటిలాగే ఎవర్ గ్రీన్ హ్యాండ్‌సమ్‌గా కనిపించారు. ఇక అన్షు పసుపు రంగు ఫ్లోరల్ లెహంగా, మ్యాచింగ్ దుపట్టా ధరించి ఎంతో అందంగా ముస్తాబయ్యారు. నీట్ హెయిర్ బన్, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్, నుదుటన చిన్న బిందీతో ఆమె లుక్ క్లాసిక్‌గా మెప్పించింది. బంతిపూల డెకరేషన్, ఫెయిరీ లైట్ల నడుమ జరిగిన ఈ వేడుకలో ఇతర అతిథులతో కలిసి దిగిన గ్రూప్ ఫొటోలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. 2002లో వచ్చిన కల్ట్ క్లాసిక్ 'మన్మథుడు' సినిమాలో నాగార్జున, అన్షు మధ్య వచ్చే ఫ్లాష్‌బ్యాక్ లవ్ స్టోరీ ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు ఎంతో ఫేవరెట్. ఆ సినిమాలో వీరిద్దరి జోడీకి మంచి గుర్తింపు దక్కింది. ఆ తర్వాత సినిమాలకు దూరమైన అన్షు, చాలా కాలం తర్వాత మళ్లీ నాగార్జునతో కలిసి కనిపించడంతో అక్కినేని అభిమానులు, సినీ ప్రియులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. వీరిద్దరి కలయికను చూసి 'మన్మథుడు కాంబో ఈజ్ బ్యాక్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.








## మరింత క్వాలిటీ కోసం రష్మిక మందన్న 'మైసా' విడుదల వాయిదా


ప్రముఖ నటి రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే థియేటర్లలోకి రావడానికి సరిగ్గా ఐదు రోజుల ముందు మేకర్స్ ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ 'అన్‌ఫార్ములా ఫిల్మ్స్', దర్శకుడు రవీంద్ర పుల్లే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంయుక్తంగా ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. "తెలుగు సినిమా ప్రస్తుతం ఎంతో ఆసక్తికరమైన దశలోకి ప్రవేశించింది. అద్భుతమైన ప్రతిభ, సాంకేతిక విలువలతో కూడిన సినిమాలతో పరిశ్రమ స్థాయి నిరంతరం పెరుగుతోంది. అదే స్ఫూర్తితో 'మైసా' చిత్రాన్ని కూడా సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలతో, సరికొత్త యాక్షన్ విజువల్స్ తో పెద్ద తెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని ఇచ్చేలా రూపొందిస్తున్నాం. మేము అనుకున్న ఈ విజన్‌ను ఎలాంటి రాజీ లేకుండా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ విడుదలను వాయిదా వేయాలని నిర్ణయించాం" అని చిత్ర బృందం తమ ప్రకటనలో వివరించింది. అయితే కొత్త విడుదల తేదీని ప్రస్తుతానికి వెల్లడించలేదని, అతి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. ప్రేక్షకులు ఈ చిత్రం కోసం ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం రాదని మేకర్స్ భరోసా ఇచ్చారు.చిత్ర యూనిట్ విడుదల చేసిన అధికారిక ప్రకటనపై కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఈ ప్రకటనను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంటూ.. "సినిమా విడుదల వాయిదా పడుతోంది. ఎప్పటికి వస్తుందో నాకూ ఇంకా తెలియదు. కానీ విడుదల తేదీ ఎప్పుడనేది నాకు తెలిసిన వెంటనే కచ్చితంగా మీతో పంచుకుంటాను" అని రష్మిక పేర్కొన్నారు. ఈ చిత్రానికి రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రాజ్ కుమార్ కందమూడి కథను సమకూర్చారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో రష్మికతో పాటు ఈశ్వరీ రావు, రాహుల్ రవీంద్రన్, సముద్రఖని, రావు రమేశ్, శివ కందుకూరి, కార్తీక్ రంజని, తారక్ పొన్నప్ప, నిధి సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.






## రణ్‌వీర్ సింగ్‌లో మంచి క్రికెటర్ ఉన్నాడు: సచిన్ టెండూల్కర్

ముంబైలో జరిగిన 'గ్లోబల్ పీస్ ఆనర్స్ 2026' కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మధ్య ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా '83' చిత్రంలో కపిల్ దేవ్‌గా రణ్‌వీర్ నటనను సచిన్ ప్రత్యేకంగా అభినందించాడు. రణ్‌వీర్ ఒక మంచి క్రికెటర్ కాగలడని అభిప్రాయపడ్డాడు. ఈ కార్యక్రమంలో భాగంగా.. "పాత్రలు తారుమారైతే, మనలో ఎవరు మంచి క్రికెటర్ అవుతారు, ఎవరు మంచి నటుడు అవుతారని మీరు అనుకుంటున్నారు?" అని రణ్‌వీర్ సింగ్ సచిన్‌ను ప్రశ్నించారు. దీనికి సచిన్ స్పందిస్తూ.. "అదొక గూగ్లీ! మీరు సినిమాలో ఫాస్ట్ బౌలింగ్ చేశారు కదా? మీరు ఆ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు" అని ప్రశంసించాడు. ఈ సందర్భంగా సచిన్ 1983 ప్రపంచకప్ నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. "మేము కపిల్ పాజీని చూస్తూ పెరిగాం. నా క్రికెట్ ప్రయాణం కూడా అక్కడి నుంచే మొదలైంది. అందుకే మీ నటన చూస్తుంటే మిమ్మల్ని ఓ క్రికెటర్‌గా ఊహించుకోగలిగాను. ఆ పాత్రకు మీరే సరైనవారు" అని అన్నాడు. అంతేకాకుండా, "ఎప్పుడైనా నెట్స్‌కు వచ్చి నాకు బౌలింగ్ చేయండి" అని రణ్‌వీర్‌ను సచిన్ ఆహ్వానించడంతో రణ్‌వీర్ సంతోషం వ్యక్తం చేశారు. ఇక క్రికెటర్ల నటన గురించి సచిన్ సరదాగా మాట్లాడుతూ.. క్రికెటర్లకు నటన కొత్తేమీ కాదని, చాలామంది సినిమాల్లోనూ నటించారని హర్భజన్ సింగ్, శ్రీశాంత్, ఇర్ఫాన్ పఠాన్‌ల పేర్లను ప్రస్తావించాడు. కబీర్ ఖాన్ దర్శకత్వం వహించిన '83' చిత్రం, 1983లో భారత జట్టు ప్రపంచకప్ గెలిచిన చారిత్రక నేపథ్యంతో తెరకెక్కిన సంగతి తెలిసిందే.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com